# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 9-8-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :25 | సంచిక: 277 | పేజీలు 8 | వెల: రూ.1/-


## ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న ప్రదానం

న్యూఢిల్లీ, ఆగస్టు 8: దేశ అత్యున్నత పౌర పురస్కారం భారత రత్నను మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ అందుకున్నారు. రాష్ట్రపతి భవన్ లో 2019 సంవత్సరానికి గాను ముగ్గురు ప్రముఖులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ భారతరత్న అవార్డులను ప్రదానం చేశారు. ప్రణబ్‌తో పాటు సరస్వతి శిశు మందిర్ వ్యవస్థాపకుడు దివంగత శ్రీ నానాజీ దేశ్‌ముఖ్, సంగీత విద్వాంసుడు శ్రీ భూపేన్ హజారికాకు ఈ ఏడాది జనవరిలో రాష్ట్రపతి రామ్‌నాథ్ భారతరత్న అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రణబ్ ముఖర్జీ, భూపేన్ హజారికా తరపున ఆయన కుమారుడు తేజ్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్ తరపున దీన్‌దయాళ్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ వీరేంద్రజిత్ సింగ్ భారతరత్న అవార్డులను రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. భారతరత్న అవార్డు పొందిన రాష్ట్రపతులు రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, వీవీ గిరి సరసన ప్రణబ్ ముఖర్జీ కూడా చేరారు.

# దేశమంతటా హై అలర్ట్

**– ఏడు రాష్ట్రాల్లో భద్రత పెంచాలని కేంద్రం ఆదేశం**

**– ఎయిర్ పోర్టుల్లో తనిఖీలు**

న్యూఢిల్లీ, ఆగస్టు8(ఆర్‌ఎన్‌ఎ) : జమ్ముకశ్మీర్ రాష్ట్ర పునర్ విభజన, ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాలతో కేంద్రం అలర్టైంది. నిఘా వర్గాల సమాచారంతో దేశమంతటా హై అలర్ట్ ప్రకటించింది. ముందస్తు జాగ్రత్తలు ఇప్పటికే తీసుకున్న కేంద్ర హోంశాఖ.. తాజా సమాచారంతో మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాల పోలీస్ శాఖలకు సూచనలు చేసింది. స్వాతంత్య్ర దినోత్సవానికి మరో వారం రోజులే ఉండటంతో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో అన్ని రాష్ట్రాలను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. ముఖ్యంగా ఉగ్రవాద సంస్థ జేషే మొహమ్మద్ దాడులు చేయనున్నట్లు హెచ్చరికలు చేసింది. కశ్మీర్ వ్యాలీతో పాటు మరో ఏడు రాష్ట్రాల్లో దాడులు జరగనున్నట్లు అనుమానిస్తున్నారు. ఉగ్రవాదులకు పాక్‌కు చెందిన ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) ఊతమిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో హై అలర్ట్‌ను ప్రకటించారు. ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల్లో జేషే దాడులకు ప్లాన్‌చేసినట్లు అనుమానిస్తున్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర బందోబస్తు, తనిఖీలకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. దేశమంతటా ఉన్న అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లోనూ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎప్పటికప్పుడు బందోబస్తు సమాచారం ఇవ్వాలని అన్ని రాష్ట్రాల పోలీసులకు కేంద్రం ఆదేశించింది. మరోవైపు.. జమ్ము కశ్మీర్ లో తీసుకున్న ముందస్తు బందోబస్తు చర్యలతో ఆ రాష్ట్రంలో ప్రశాంతత కనిపిస్తోంది. ఐతే భద్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని.. అల్లరిమూకలకు అవకాశం ఇవ్వొద్దని కేంద్ర హోంశాఖ భావిస్తోంది. జమ్మూకాశ్మీర్ లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ప్రతి కిలోమీటర్ కు ఒక సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఏర్పాటుచేసింది.

**శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదనపు భద్రత..**

శంషాబాద్ ఎయిర్ పోర్టులో భద్రత సిబ్బంది హై అలెర్ట్ ప్రకటించింది. స్వాతంత్య్ర దినోత్సవంతో పాటు జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశముందని నిఘా వర్గాలు తెలిపాయి. దీంతో శంషాబాద్ ఎయిర్ పోర్టలో అదనపు భద్రతను ఏర్పాటు చేశారు. అనుమానిత వస్తువులు, వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రయాణికులను భద్రతా బలగాలు హెచ్చరిస్తున్నాయి. సందర్శకుల పాసులు సైతం ఎయిర్ పోర్ట్ అధికారులు రద్దు చేశారు. ఆగస్టు 10 నుంచి 20వ తేదీ వరకు విమానాశ్రయాల్లోకి విజిటర్స్‌ను అనుమతిని రద్దు చేస్తున్న అధికారులు తెలిపారు. కేవలం టికెట్లు ఉన్న ప్రయాణికులు మాత్రమే ఎయిర్‌పోర్టకు రానిస్తారు.

# తమిళనాడులో దారుణం

**– చెల్లిని ప్రేమించాడని యువకుడిపై కత్తులతో దాడి**

**– తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న యువకుడు**

**– నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు**

చెన్నై, ఆగస్టు8(ఆర్‌ఎన్‌ఎ) : చూస్తేనే ఒల్లు జలదరించే సంఘటన ఇది. చదివితే ఒళ్లు గగుర్పొడిచే దారుణం ఇది. తమ ఇంటి అమ్మాయిని ప్రేమించిందని .. ఆ యువకుడి ఇంటికి వెళ్లి మరీ అత్యంత కిరాతకంగా దాడిచేశారు అమ్మాయి కుటుంబసభ్యులు. తమిళనాడులోని తిరుచ్చి జిల్లాలో గురువారం ఉదయం ఈ దారుణం జరిగింది. తీవ్ర గాయాలపాలైన ఆ యువకుడు హాస్పిటల్ లో చావుతో పోరాడుతున్నాడు. దాడి ఘటన ప్రత్యక్షంగా చూసినవాళ్లు భయంతో వణికిపోయారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలోనూ రికార్డయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తిరుచ్చి జిల్లా తిరువనాయి కోయిల్.. తిమ్మరాయ సముద్రంలో మణికంఠ అనే యువకుడు కూలీగా పనిచేస్తున్నాడు. బిల్డింగ్ పనుల్లో తాపీ మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానిక భారతి వీధికి చెందిన ఓ అమ్మాయి, మణికంఠ ప్రేమించుకున్నారు. ఈ వ్యవహారం అమ్మాయి అన్న శివకు తెలిసింది. తాపీమేస్త్రీతో ప్రేమవ్యవహారం ఏమాత్రం నచ్చని శివ.. తన కుటుంబసభ్యులు, ఫ్రెండ్స్ ను వెంటపెట్టుకుని మణికంఠ ఇంటికి వెళ్లాడు. ఇంట్లోనుంచి ఎప్పుడెప్పుడు బయటకొస్తాడా అని ఎదురుచూసిన వాళ్లు మాటువేసి.. రాడ్లు, కత్తితో దాడిచేశారు. అతడి ఇంట్లోకి వెళ్లి మరీ రాడ్లతో కొడుతూ.. కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో విచక్షణ లేకుండా నరికారు. ముందు ప్రతిఘటించినా.. కత్తిగాట్లతో అతడు నిస్సహాయ స్థితిలో కింద కుప్పకూలిపోయాడు. ఐనప్పటికీ.. వాళ్లు కత్తి, రాడ్లతో కొట్టి తమ కసి తీర్చుకుని అక్కడినుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన యువకున్ని స్థానికులు హాస్పిటల్ కు తీసుకెళ్లారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు. పోలీసులు కేసు రిజిస్టర్ చేసి సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# కృష్ణమ్మ పరవళ్లు..

**– నిండుకుండలను తలపిస్తున్న ప్రాజెక్టులు**

**– శ్రీశైలం ప్రాజెక్టులకు భారీగా వరదనీరు**

**– నాగార్జున సాగర్‌కు నీటి విడుదలకు అధికారుల సన్నాహాలు**

హైదరాబాద్, ఆగస్టు 8(ఆర్‌ఎన్‌ఎ) : కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుంది.. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు తెలంగాణ ప్రాంతాల్లోనూ కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టుల్లో వరదనీరు వచ్చిచేరుతోంది. తెలంగాణలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చుతుండటంతో పరివాహక ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆల్మట్టీ నారాయణపూర్ డ్యాం నుంచి దిగవకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. గురువారం అర్థరాత్రి నాటికి సుమారు 4లక్షల క్యూసెక్కుల నీరు కృష్ణానదిలో ప్రవహిస్తూ జూరాలకు చేరుతుంది. దీంతో కృష్ణానదీ పరివాహక ప్రాంతాల ప్రజలను తెలంగాణ అధికారులు అప్రమత్తం చేశారు. మక్తల్, నారాయణపేట, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే అధికారులు ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లవద్దని ఆదేశించారు. ఇదిలా ఉంటే గత నాలుగు రోజుల నుంచి జూరాలకు భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఇప్పటికే జూరాల నిండుకుండను తలపిస్తోంది. జూరాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు మరింత పెరగడంతో గురువారం సాయంత్రంకు 32గేట్లను ఎత్తి దిగువకు తరలిస్తున్నారు. మొన్నటివరకు నిరాశాజనకంగా ఉన్న వరద.. గత కొన్ని రోజులుగా అంతకంతకూ ఉధృతమవుతున్నది. నారాయణపుర నుంచి వేల క్యూసెక్కుల్లో మొదలైన ఇన్‌ఫ్లోలు.. ఇప్పుడు లక్షల్లోకి చేరుకుంటున్నాయి. దీనికితోడు ఉజ్జయిని నుంచి వచ్చే వరద ప్రవాహం కూడా తోడవటంతో జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. గంటగంటకు డ్యామ్ నీటిమట్టం పెరుగుతోంది. మరో రెండు రోజుల్లో గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. ఆల్మట్టి, భీమా వరదలతో కలిపి కృష్ణాలో 4 లక్షల క్యూసెక్కులకు పైగా ప్రవాహం శ్రీశైలానికి నేటి నుంచి వచ్చే అవకాశముంది. శ్రీశైలం ఎఫ్ ఆర్ ఎల్ 885 అడుగులస్థాయిలో 215.81 టీఎంసీలు కాగా... బుధవారం సాయంత్రం 6 గంటలకు 872.60 అడుగుల నీటి మట్టంతో 153 టీఎంసీలకు చేరుకున్నది. మరో 62 టీఎంసీలు చేరితే శ్రీశైలం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికి చేరుకుంటుంది. గురువారం అర్ధరాత్రికి జలాశయం నిండుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కొద్దిపాటి నీటిని నాగార్జున ప్రాజెక్టులకు వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరుతుండటంతో శ్రీశైలం జలాశయంలోకి ఊహించని స్థాయిలో వరదనీరు వచ్చిచేరుతుంది. దీంతో నాగార్జున సాగర్‌కు భారీ వరదనీరు వచ్చిచేరే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే వర్షాలకు తోడు ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చిచేరుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## చరిత్రలో నేటినిజం



కం॥ తెలుగు - సినిమా వారస్వము
చాలగ - ప్రజ తెల్ల మెచ్చు - సరణిన - చేయం
జాలన "వేంకట్రామని"
"రేలంగి" - చలమ - వారస్వ బుద్ధి వర్మునిగన !!

–రాధశ్రీ

( ఆగష్టు 9 రేలంగి జయంతి..)

సెల్: 9494481210

# అంబర్‌పేటలో చైన్ స్నాచింగ్

హైదరాబాద్, ఆగష్టు 8: నగరంలోని అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గల పటేల్ నగర్‌లో చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. మహిళ మెడలో నుంచి దొంగలు నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మహారాష్ట్ర వరదల్లో విషాదం

**సాంగ్లీ నదిలో పడవ బోల్తాపడి 14మంది మృతి**

ముంబయి,ఆగస్ట్ 8 (ఆంఎన్‌ఎ): భారీవర్షాలతో అతలాకుతలం అవుతున్న మహారాష్ట్రలో ఘోరం జరిగింది. సాంగ్లీ ప్రాంతంలో సహాయక చర్యల్లో పాల్గొన్న పడవ బోల్తాపడి 14 మంది మృతిచెందారు.

మహారాష్ట్రలో ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో అతాలకుతలం అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర పశ్చిమ జిల్లాలు. వరదల కారణంగా వివిధ ప్రాంతాల్లోని 1.32 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా సహాయకచర్యల్లో పాల్గొన్న పడవ బోల్తాపడి 14మంది గల్లంతయ్యారు. ఈ ఘటన తో ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తన మహా జన్ ఆదేశ్ యాత్రను రద్దు చేసుకుని వరద ప్రభావంపై సహచర మంత్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడిచిన 7 రోజుల్లో మహారాష్ట్ర పశ్చిమ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 16 మంది మృతిచెందినట్లుగా సమాచారం. వరదల కారణంగా సాంగ్లీ జిల్లాలో 51 వేల మంది, కోల్హాపూర్ జిల్లాలో 51 వేల మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు. వరదల వల్ల నష్టపోయిన వారికి సాయంగా రూ.10 వేలు, రూ. 15 వేలను అందించనున్నట్లు సీఎం ఫడ్నవీస్ తెలిపారు.

## మహారాష్ట్రలో పడవ బోల్తా..

# 14 మంది మృతి



ముంబయి,ఆగష్టు 7: కొన్ని నెలల క్రితం కరువుతో కటకటలాడిన మహారాష్ట్ర ప్రస్తుతం ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో అతాలకుతలం అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర పశ్చిమ జిల్లాలు. వరదల కారణంగా వివిధ ప్రాంతాల్లోని 1.32 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా సాంగ్లీ ప్రాంతంలో సహాయక చర్యల్లో పాల్గొన్న పడవ బోల్తాపడి 14 మంది మృతిచెందారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తన మహా జన్ ఆదేశ్ యాత్రను రద్దు చేసుకుని వరద ప్రభావంపై సహచర మంత్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడిచిన 7 రోజుల్లో మహారాష్ట్ర పశ్చిమ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 16 మంది మృతిచెందినట్లుగా సమాచారం. వరదల కారణంగా సాంగ్లీ జిల్లాలో 51 వేల మంది, కోల్హాపూర్ జిల్లాలో 51 వేల మందిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు. వరదల వల్ల నష్టపోయిన వారికి సాయంగా రూ.10 వేలు, రూ. 15 వేలను అందించనున్నట్లు సీఎం ఫడ్నవీస్ తెలిపారు. అదేవిధంగా కర్ణాటక ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్పతో సీఎం ఫడ్నవీస్ ఫోన్‌లో మాట్లాడారు. ఆల్మట్టి డ్యాం నుంచి 5 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలేందుకు యడియూరప్ప అంగీకరించారు. దీంతో సాంగ్లీ ప్రాంతంలో వరద ఉద్ధృతిని తగ్గనుంది.

## భారత్ సినిమాలపైనా అక్కసు

**ప్రదర్శనను నిషేధించిన పాక్**

ఇస్లామాబాద్,ఆగస్టు8( ఆర్‌ఎన్‌ఎ): జమ్మూకాశ్మీర్ విభజన , ఆర్టికల్ 370 రద్దుతో భారత్ పై దాయాది దేశమైన పాక్ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలోనే పాక్ భారత్ తో ఉన్న వాణిజ్య బంధాన్ని తెంచుకుంది. జమ్మూకాశ్మీర్ విషయంలో అంతర్జాతీయ మద్దతు కూడగట్టకునేందుకు పాక్ చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఈ క్రమంలో సరిహద్దు వెంబడి భారత్ సైనికులు మోహరించారు. అయితే భారతీయ సినిమాలపై పాక్ నిషేధం విధించి తన అక్కసును ఇలాకూడా చాటుకుంది. పాక్‌లోని థియేటర్లలో ఇకపై భారత్ సినిమాలు ప్రదర్శించరని పాక్ సమాచార, ప్రసారశాఖ స్పెషల్ అసిస్టెంట్ డాక్టర్ పిర్దౌసి ఆశిక్ అవన్ తెలిపారు. ఆర్టికల్ 370ను పునరుద్ధరించే వరకు కాశ్మీరీలకు పూర్తి మద్ధతు ఇస్తామని ఆమె తేల్చి చెప్పారు.

# సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



హైదరాబాద్, ఆగష్టు 7: సమ్మక్క, సారలమ్మ జాతర ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రులు నేడు సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. 2020 ఫిబ్రవరి 5 నుంచి 8న తేదీ వరకు మేడారం జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రానికి మరోసారి విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా మేడారం జాతరను నిర్వహిస్తామన్నారు. మేడారం జాతరకు కోటిన్నర మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రితో పాటు అన్ని రాష్ట్రాల గిరిజన సంక్షేమశాఖల మంత్రులను అదేవిధంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ గిరిజన సంఘాల ప్రతినిధులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. మేడారం జాతర నిర్వహణకు అవసరమైన శాశ్వత ఏర్పాట్లు కల్పించేవిధంగా చర్యలు ప్రారంభమైనట్లు వెల్లడించారు. తొలివిడతలో రూ.10 కోట్లతో గద్దెల పరిసరాల్లో భూసేకరణ జరపాలని నిర్ణయించినట్లు మంత్రులు పేర్కొన్నారు.

# దేవుడా.. ఇలాంటి పొరుగువాళ్లు ఎవరికీ ఉండకూడదు

హైదరాబాద్, ఆగష్టు 8: పాకిస్థాన్‌ను ఉద్దేశించి కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పాక్ లాంటి పొరుగువారు ఎవరికీ ఉండకూదన్నారు. ఎవరికీ ఇలాంటి పొరుగువార ఉండకూడదని దేవుణ్ని ప్రార్థిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లా డారు. కశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో పాక్ దౌత్య పరమైన చర్యలకు దిగింది. దీన్ని కేంద్ర మంత్రి ఖండించారు. పొరుగు దేశం గురించి భయాందోళనలు ఉన్నాయని, స్నేహితులం మార్చగలం కానీ, పొరుగువారిని మార్చే శక్తి మన చేతుల్లో ఉండదన్నారు.



# ఉత్పత్తుల కార్యకలాపాలు ప్రభావితం..!

నేటినిజం

శుక్రవారం 9-8-2019

ఆహార ధాన్యాలు , ఇంకా ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ద్రవ్యోల్బణ తీవ్రత అధికమవుతోంది. నిత్యావసరాల ధరలకు సామాన్యుడు కొనలేక సతమతమవుతున్నాడు. ఒకప్పుడు రూపాయికి ఒక డాలరు లభించిన రోజులు, డాలరు విలువ 62 రూపాయలకు మించిపోయింది. రూపాయి కొనుగోలు శక్తి క్రమంగా క్షీణిస్తోంది. అవసరమైన ఆహారధాన్యాలను , నిత్యావసర వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకుని స్వయంసమృద్ధితో ఆర్థిక స్వావలంబన చేసుకునే దిశగా కృషి అవసరమన్నారు గాంధీజీ. ఈ స్పూర్తికి విరుద్దంగా, ఈ ఆలోచనలకు పొంతన లేకుండా విదేశీ వస్తువుల పట్ల మోజు నానాటికీ అధికమవుతోంది. సరళీకృత ఆర్థిక విధానంలో చైనా బియ్యం నుంచి ఆఫ్రికా బంగారం వరకు దిగుమతులు ఎక్కువైపోతున్నాయి. సుంకం పెంచడం ద్వారా బంగారం దిగుమతులను కొంత వరకు నియంత్రించారు. ఇతర దిగుమతులు కొనసాగుతూనే ఉన్నాయి. విదేశీ వ్యాపార లోటు కంటే మనదేశ వ్యాపార లోటు చాలా తక్కువగా ఉంది. ఇదే ఆందోళన పడాల్సిన విషయం. రూపాయి పతనానికి వ్యవసాయం సమస్యల వలయంలో చిక్కుకోవడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి. 2008-2009 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రభావం మనదేశ ఆర్థిక వ్యవస్థపైన పడింది. ఇందుకు రిజర్వుబ్యాంకును అనుసరిస్తున్న ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశీ వ్యాపార విధానాలు కారణాలు కావచ్చు. ప్రపంచ వ్యాపార సంస్థలో సభ్యత్వం గల దేశం మనది. అందువల్ల కొన్ని నిబంధనలకు కట్టుబడి ఉండటం వలన మనదేశంలో వ్యవసాయ ఉత్పత్తుల కార్యకలాపాలు ప్రభావితం అవుతున్నాయి.

దేశంలో లభ్యమయ్యే ఖనిజ సంపదను వినియోగించుకోకుండా దిగుమతులపై ఆధారపడి విదేశీ మారక ద్రవ్యాన్ని పెద్దమొత్తంలో వ్యయీకరించడమూ ప్రస్తుత సంక్షోభానికి కారణం అవుతోంది. దేశంలో 60 శాతం జనాభాకు ఉపాధి అందిస్తున్న వ్యవసాయ రంగానికి తగినంత ప్రాధాన్యత లభించకపోవడం ఈ సంక్షోభానికి ముఖ్యకారణం. ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గుముఖం పడతాయి. తగ్గితే ధరలు తగ్గుతాయి. అందుకే వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు ప్రభుత్వం కేటాయింపులు పెంచాలి. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి. వాణిజ్య పంటల ధరలు ఎక్కువగా ఉంటుండటంతో రైతులు ఆ పంటలపై మొగ్గుచూపుతున్నారు. కనుక కనీస మద్దతు ధర అన్ని పంటలకు నిర్ణయించాలని ప్రభుత్వం ఇప్పటికైనా మేలుకోవాలి.రైతుకు గిట్టుబాటు ధర లభింపజేయడం అత్యంత ముఖ్యమైనది. ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయం కన్నా 50 శాతం అధికంగా ఉండాలన్న స్వామినాధన్ సిఫార్సును నిత్యం గౌరవించాలి. దేశాన్ని సంక్షోభం నుంచి కాపాడటానికి ఒకవైపు ప్రజలు, ప్రభుత్వం బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. స్వదేశీ వస్తువుల వినియోగం ఎంత అవసరమో? ఎందుకు అవసరమో అనే విషయాన్ని గాంధీ సూచించిన మార్గాలను అనుసరించాలి..!!

## హరితహారం ఉద్యమంగా సాగాలి

### మొక్కలు పెంచి కాపాడుకోవాలి
### రోజుకొకరు నీరుపోసి రక్షించాలి: మంత్రి

నిజామాబాద్,ఆగస్ట్ 8(ఆర్‌ఎన్‌ఎ): హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా కాపాడాలని మంత్రి ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వర్షాలు పడుతున్నందున అధికారులు, ప్రజలు ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకుని వెళ్లాలని కోరారు. హరితతెలంగాణ నిర్మాణానికి ముఖ్యమంత్రి కేసీఆర్ విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణెళి ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. చెట్లను నరకటం వలన మానవుని మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత పర్యావరణ పరిరక్షణ కోసం కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రతి సంవత్సరం దిగ్విజయంగా మొక్కలు నాటిస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి పనులు ఉన్నాయో తెలియక పనులు చేసే అవకాశం కోల్పోతున్నారని మంత్రి అన్నారు. వారందరికి హరితహారంలో మొక్కల సంరక్షణ బాధ్యత అప్పగించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని అన్నారు. ఇప్పటికే అనేక గ్రామాల్లోఅత్యధిక మొక్కలు నాటుతున్నారని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటటంతోపాటు వాటిని సంరక్షించాల్సిన భాద్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. రాష్ట్రంలో 230 కోట్లు మొక్కలను నాటటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అడువుల నరికే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రతిఒక్కరూ సామాజిక భాద్యతగా హరితవిప్లవం చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతిఇంట్లో రెండు మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు దేశానికి ఆదర్శమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ భవిష్యత్తు ఆలోచనతో అమలు చేస్తున్న డబుల్‌బెడ్ రూం ఇండ్లు దేశంలోనే సాహసమైన పథకమని అభివర్ణించారు. ఒక్కో ఇంటికి రూ.5.30 లక్షలు ఖర్చు చేస్తుందన్నారు. టీఆర్ఎస్ పార్టీపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. గిరిజన, బలహీన వర్గాలకు చదువు ఆవశ్యకత ఇంకా ఉందని అన్నారు. అర్హులైన కుటుంబాలకు సాగు భూమి ఇవ్వడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి పనులను సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందని గుర్తు చేశారు.

## అభివృద్ధిలో కోరుట్ల ముందంజ: ఎమ్మెల్యే

జగిత్యాల,ఆగస్ట్8(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణలో నలభై ఏండ్ల అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపిన ఘనత సిఎం కెసిఆర్‌దని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు.

త్వరలోనే మిషన్ భగీరథ పనులు పూర్తయి ఇంటింటికీ మంచినీరు అందబోతున్నదని అన్నారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచి రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు సాధించామని వివరించారు.

నాలుగో విడతో భాగంగా గ్రామాల్లో హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. హరితహారంలో అగ్రభాగాన నిలిచిన గ్రామాలకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా అందరూ మొక్కలు నాటాలన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

### ఇద్దరు యువకుల దుర్మరణం

రంగారెడ్డి,ఆగస్ట్8(ఆర్‌ఎన్‌ఎ): శంషాబాద్ మండలం సాతంరాయి వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం ఉదయం ఘోర రోడ్డుప్రమాదం జరగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. రహదారిపై ఆగి ఉన్న డీసీఎంను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కన్ను, అనిల్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చరణ్, సాయి, ప్రశాంత్ రెడ్డి, హరీష్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదస్థలికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# దేశహితం పట్టని రాజకీయ పార్టీలు

హైదరాబాద్, ఆగష్టు 8:దేశంలోని కాంగ్రెస్ తదితర రాజకీయ పార్టీలకు, లెఫ్ట్ భావజాలంతో వితండవాదం చేసే కొందరు జర్నలిస్టులకు నిద్రపట్టడం లేదు. కాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దుపై వితండవాదం చేస్తున్న తీరు జుగుప్స కలిగిస్తున్నాయి. పాక్ ,చైనాలు ఏం చేసినా వారిక మంచిగానే కనిపిస్తుంది. అధికారంలో ఉండి కాంగ్రెస్ ఎన్ని దగుల్బాజీ పనులు చేసినా నచ్చుతుంది. కానీ బిజెపి అధికారంలో ఉండి 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం ద్వారాకాశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేస్తే మాత్రం తట్టుకోలేకపోతున్నారు. అందుకే వారి చర్చలు, మాటలు, విమర్శ పాక్‌కు అనుకూలంగా ఉన్నాయే తప్ప భారత్‌కు కాదు. ప్రధానంగా పార్లమెంట్ ఆమోదం పొంది, రాష్ట్రపతి ముద్ర పడిన 370 ఆర్టికల్‌ను పట్టుకుని చేస్తున్న విమర్శలు దేశహితాన్ని కోరేలా లేవు.

పాక్‌కు వంతపాడేలా మాత్రమే ఉన్నాయి. ఏడుదశాబ్దాల రావణకాష్టాన్ని చల్లార్చే క్రమంలో తీసుకున్న చారిత్రక నిర్ణయం మీది ఎవరికి వచ్చినట్లుగా వారు మాట్లాడుతున్నారు. నిజంగానే పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం కాశ్మీర్‌ను తగులబెడుతుంటే చలి కాచుకున్న రాజకీయ పార్టీలు ఇవాళ గగ్గోలు పెడుఉతన్న తీరు భారత పౌరులను అవమానపరిచేదిగా ఉంది. దేశం ముక్కచెక్కల యినా పట్టించుకోని కాంగ్రెస్,కమ్యూనిస్ట్ పార్టీలు చేస్తున్న వితండవాదాలు సగటు పౌరుడికి అసహ్యం కలిగిస్తున్నాయి. 370 ఆర్టికల్ రద్దు అన్నది ఓ సాహసోపేత చారిత్రక నిర్ణయం. నరేంద్ర మోదీ, అమిత్ షాలు కాంగ్రెస్ నాయకుల లాగా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాటుపడే రకం కాదని నిరూపించారు. దేశం కోసం ఏమైనా చేయగల సమర్థనేతలుగా ప్రజలు ఇప్పుడు వారిని స్తుతిస్తున్నారు. భారతదేశం గతంలో లాగా కుక్కలు చింపిన విస్తరి కాకుండా కాపసా డిన గుండె ధైర్యం కలవారని నిరూపించారు. సిమ్లా ఒప్పందాలు, బంగ్లా ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలను కాలరాస్తూ పాక్ ఉగ్రమూకలను ఎగదోస్తున్న వేళ కాశ్మీర్‌ను దారికి తెచ్చుకునే క్రమంలో 370 ఆర్టిక్ అన్న ముల్లును ముందుగా తీసివేయాల్సిన అసవరం తప్పలేదు. ఇది అనివార్యం కూడా. దేశాన్ని సక్రమమైన దారిలో నడిపించేందుకు వివిధ సంస్థల్నీ, చట్టాలనూ సంస్కరించుకోక తప్పదు. గాడితప్పిన పాలనతో దేశం ఇంతకాలం ఓ గతి లేకుండా పోయింది. దేశ సరిహద్దుల్లో సవాళు విసురుతున్నారు. ఈ దశలో కాశ్మీర్‌ను భారత్‌లో సంపూర్ణ విలీనం చేయడం అత్యావశ్యకం. ఈ విషయం తెలిసీ రాజకీయ లబ్ది పొందేందుకు, మైనార్టీల ఓట్లయినా తమకు దక్కకపోతాయన్న దింపుడు గల్లం ఆశతో రాజకీయ పార్టీలు పనికిరాని విన్యాసాలు చేస్తున్నాయి. బిజెపి తీసుకుంటున్న నిర్ణయాలను దేశంలోని 90శాతం మంది ప్రజలు స్వాగతిస్తున్నారు,. ట్రిపుల్ తల్లాక్ బిల్లును ముస్లిం మహిళలు స్వాగతిస్తున్న తీరు వారి మనో వేదనకు అద్దం పట్టింది. అందుకే నిన్న మొన్నటి వరకూ మోదీని వ్యతిరేకించిన పార్టీలు కూడా ఇప్పుడు మోదీ, అమిత్ షాల దారిలో నడవక తప్పదన్న విషయాన్ని గ్రహిస్తున్నాయి. రాజ్యసభలో ఎన్డీఏకు మెజారిటీ లేకపోయి నప్పటికి మోదీ తలచుకున్న బిల్లులన్నీ ఆమోదం పొందుతున్నాయి. ట్రిపుల్ తలాక్‌తో పాటు నదీ జలాల వివాదాలు, ఆనకట్టల రక్షణ, వినియోగదారుల ప్రయోజనాలు, సమాచార హక్కు, మోటారు వాహనాలు, మెడికల్ కౌన్సిల్, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, ఎన్ఐఏ మొదలైన అంశాలన్నిటిలో కేంద్రం దార్శనికత ప్రదర్శించింది. ఏ రాష్ట్రమూ వీటిని వ్యతిరేకించేందుకు సిద్ధంగా కనపడడం లేదు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మాత్రమే కాదు, అన్ని పార్టీలు మోదీ ప్రభుత్వ నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకించే సాహసం చేయలేక పోతున్నాయి. ఎందుకంటే ప్రజల నుంచి ఎక్కడ వ్యతిరేకత వస్తుందో అన్న భయం వాటిలో ఉంది. 370పై గుంపుటో గోవందగా విమర్శిస్తున్న పార్టీలు ఇప్పుడు ప్రజల్లోకి వెళితే ఏం సమాధానం చెప్పాలో అన్న భయంలో ఉన్నాయి. బిజెపి నాయకత్వాన్ని వ్యతిరేకించి బయటకు వచ్చిన యశ్వంత్ సిన్హా కూడా 370 ఆర్టికల్ రద్దు ఎన్నికలకు ముందు జరిగివుంటే బిజెపి స్వీప్ చేసేదని అన్నారు. అంటే ప్రజల్లో దానిపట్ల ఎంతటి వ్యతిరేకత గూడుకట్టుకుని ఉందో చెప్పవచ్చు. జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేస్తూ, రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షాలు చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. సగటు భారతీయుడు ఈ నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాడు. గుదిబండ 370 ఆర్టికల్‌ను పీకి అవతల పడేయాలని ఇంతకాలంగా అంతా గట్టిగా కోరుకుంటున్నారు. బిల్లు సందర్భంగా రాజ్యాంగాన్ని చించేసిన ఇద్దరు పిడిపి సభ్యుల చర్యను ఈ పార్టీలు, వ్యక్తులు ఏ విధంగ ఆసమర్థిస్తారో చెప్పాలి. రాజ్యాంగ ప్రతులను పార్లమెంటులోనే చించే యడం అన్న సాహసం వెనక ఉన్నదెవరు అన్నది విశ్లేషించాలి.పార్లమెంట్ వ్యవస్థలో ప్రజలు మెజారిటీ ద్వారా ఎన్నుకున్న ప్రభుత్వం తాను చేయదలుచు కున్నది అమలు చేస్తున్నాయి. మోదీ కేవలం ప్రభుత్వానికి మెజారిటీ ఉండడం వల్ల మాత్రమే కాదు, దేశ రాజకీయాలను,ప్రజలను తనకు అనుకూలంగా మార్చు కోవడంలో కూడా విజయం సాధించగలుగు తున్నారు. కాంగ్రెస్ హయాంలో పాకిస్థాన్, భారత్ ప్రభుత్వాలు హురియత్ పేరుతోనో, జెకెఎల్ఎఫ్ పేరుతోనో మిలిటెంట్ల గ్రూపులు సృష్టించి వేర్పాటు వాదాన్ని వ్యాపారంగా మార్చేశాయి. మొత్తంగా ఇన్నేళ్ల రావణకాష్టానికి కాంగ్రెస్ కారణం. దానిని అనుసరిస్తున్న పార్టీలు ఇప్పటికే మూల్యం చెల్లించాయి. ఇంకా చెల్లించుకోవడం ఖాయం.

# సగటు కాశ్మీరీలలో కూడా చిగురిస్తున్న ఆశలు

### మోడీ ద్వయంపై ప్రజల్లో పెరుగుతున్న ఆరాధన భావం

న్యూఢిల్లీ,ఆగస్ట్8(ఆర్‌ఎన్‌ఎ): కాంగ్రెస్‌తో పాటు అనేక ప్రాంతీయ ప్రభుత్వాల హయాంలో జరిగిన వికృత విన్యాసాలు, అప్రజాస్వామిక దుష్కృత్యాలు, అవినీతి కుంభకోణాలు, దారుణ మారణ కాండల మూలంగా ఇవాళ కశ్మీర్ ప్రజల భవిష్యత్తుతో పాటు భారత దేశ ప్రజల భవిష్యత్తు మోదీ, అమిత్ షా చేతుల్లో ఉన్నది. ఇన్నాళ్లూ, భారత పాకిస్థాన్‌ల మధ్య నలిగిపోయిన కశ్మీరీ ప్రజలకు బిజెపి ప్రభుత్వం న్యాయం చేస్తుందని అమిత్ షా చేసిన ప్రకటనతో ఇప్పుడు కాశ్మీరీల్లో కూడా ఆశలు చిగురించాయి. ప్రధాని మోదీ, అమిత్ షాలు ఇద్దరూ కేవలం వ్యక్తిగత ప్రయోజనాలకోసం కాంగ్రెస్ లాగా విలువల్నీ త్యజించేవారు కాదు. భారతదేశం ఉజ్వలంగా ఉండాలన్న తపన వారిలో కనిపిస్తోంది. సగటు భారతీయులు కూడా ఇప్పుడు విశ్వసిస్తున్నారు. నోట్ల రద్దు, జిఎస్టీలతో మోడీని వ్యతిరేకించిన వారు సైతం ఇప్పుడు జయహో మోడీ అంటు న్నారు. సామాజిక మాధ్యామాల్లో ఇప్పుడు మోడీ మేనియా సాగు తోంది. ఓ చారిత్రిక నిర్ణయం జరిగిందన్న భావన ఉంది. దేశంలోని మెజారిటీ ప్రజలు 370 ఆర్టికల్ రద్దును స్వాగతిస్త న్నారని గ్రహించి అనేక పార్టీలు చివరి నిముషంలో బిల్లుకు మద్దతు తెలిపాయి. ప్రజలు ఆమోదించే సమయంలో వ్యతిరేక ించడం మంచిది కాదని పార్లమెం ట్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలు అభిప్రాయపడి తమ మనసు మార్చుకున్నాయి. కశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి రద్దు చేసిన విషయంలో మోదీ ధైర్యం గా నిర్ణయం తీసుకున్నారని, ఇన్నాళ్లకు కశ్మీర్‌ను భారత్‌లో నిజంగా కలిపారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఈ సమాచారంతోనే చివరి క్షణాల్లో అనేక రాజకీయ పార్టీల్లో చీలికలు వచ్చాయి. అందుకే కొందరు రాజకీయ పార్టీల నేతలు తమ పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా ప్రకటనలుచేస్తున్నారు. జ్యోతిరాదిత్య సింధియా లాంటి వారు 370 రద్దును స్వాగతించారు. కశ్మీర్ విషయంలో మోదీ నిర్ణయాన్ని సమర్థించకపోతే ప్రజలకు దూరమవుతామని తెలియగానే కాంగ్రెస్‌లో అంతర్గత చర్చ తీవ్రమైంది. కశ్మీర్ అంతర్గత అంశం మాత్రమే కాదని, అంతర్జాతీయ అంశమని కూడా కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ అనడంతో సోనియా తీవ్రంగా తప్పుపట్టారు. భువనేశ్వర్ కలితా మాత్రమే కాదు, తమ పార్టీ చేసిన చారిత్రక తప్పిదాన్ని బిజెపి సవరించిందని సీనియర్ కాంగ్రెస్ నేత జనార్దన్ ద్వివేదీ అన్నారు. దీపేంద్ర హూడా, జ్యోతిరాదిత్య సింధియా వంటి యువ కాంగ్రెస్ నేతలు కూడా మోదీ నిర్ణయాన్ని సమర్థించారు. బహుజన సమాజ్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, వైసీపీ, తెలుగుదేశం, టిఆర్ఎస్‌తో సహా దేశంలోని మెజారిటీ పార్టీలు మోదీకి అండగా నిలిచాయి. ఎట్టకేలకు కశ్మీర్ నిజంగా భారత దేశంలో అంతర్భాగం అయిందని ఈ పార్టీల నేతలు వ్యాఖ్యానించారు. మోదీ నిర్ణయంతో మొత్తం ప్రతిపక్షాలే కకావికలైనట్లు దీన్ని బట్టి అర్థమవుతోంది. ఓ నిబద్ధ సిద్ధాంత బలం ద్వారానే వారు కశ్మీర్ విషయంలో ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారు. అందుకే ఇవాళ బిజెపి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగింది. కాశ్మీర్ విషయంలో మాత్రం ప్రజల హృదయాల్లో చరిస్తథాయిగా నిలిచిపోతారు.

# ట్రిపుల్ తలాక్ చెప్పడంతో కేసేసిన మహిళ

### ఆగ్రహంతో భార్య ముక్కు కోసిన దుండగులు

లక్నో,ఆగస్ట్8(ఆర్‌ఎన్‌ఎ): ట్రిపుల్ తలాక్ చెప్పిన భర్తపై కేసు పెట్టిన భార్య ముక్కును కోసేశాడో దుర్మార్గుడు. ఈ సంఘటన ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్‌లో చోటు చేసుకుంది.

ఏకకాలంలో మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా విడాకులిచ్చే పద్ధతిని క్రిమినల్ నేరంగా పరిగణించే ముస్లిం మహిళల(వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2019 బిల్లును పార్లమెంట్ ఇటీవలే ఆమోదించిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదించడంతో ఆ బిల్లు చట్టం రూపం దాల్చింది. ముస్లిం మహిళకు మూడుసార్లు తలాక్ చెబితే..

కొత్త చట్టం ప్రకారం భర్తలకు మూడేళ్ల జైలు శిక్ష విధించనున్నారు. అయితే సీతాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన భార్యకు ఫోన్‌లో మూడుసార్లు తలాక్ చెప్పాడు.

దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికీ భర్త తన భార్య నుంచి దూరంగా ఉంటానని చెప్పడంతో.. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆ ముస్లిం మహిళపై భర్త కుటుంబ సభ్యులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అంతటితో ఆగకుండా పదునైన కత్తితో ఆమె ముక్కును కూడా కోసేశారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీతాపూర్ పోలీసులు తెలిపారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులందరికి భూ పంపిణీ

### అవకాశం ఉన్నచోటల్లా అమలు చేస్తున్నాం: ఎమ్మెల్యే

సంగారెడ్డి, ఆగస్ట్ 8 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్ఠాత్మకంగా అమలు చేస్తున్న దళితబస్తీలో అర్హులందరికీ మూడెకరాల వ్యవసాయ భూమిని అందజేస్తామని ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. దళిత బస్తీ పథకం కోసం భూమి లేని ఎస్సీ రైతులను గుర్తించి, వారికి ప్రభుత్వం తరుపున మూడెకరాల భూముల్ని ఇస్తామని చెప్పారు. అర్హులకు ఒక్కొక్కరికీ మూడెకరాల చొప్పున భూముల్ని త్వరలోనే అందజేస్తామన్నారు. ప్రభుత్వం అందజేసిన ఈ భూముల్ని రైతులు ఇతరులకు విక్రయించినట్లు ఫిర్యాదు అందితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొని, ఆ భూముల్ని వెనక్కి తీసుకుని ఇతర రైతులకు అప్పగిస్తామని చెప్పారు.

రైతులు, గ్రామ అవసరాల ప్రకారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను చేపట్టి కూలీలకు వంద రోజుల పని దినాలను కల్పించాలని అన్నారు. గ్రామాల్లో రైతుల అవసరాలను గ్రామ అవసరాలను పనులు ప్రతిపాదించి నిర్వహించాలన్నారు. వాటర్ కన్జర్వేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలను నిర్మించుకునేలా చూడాలని తెలిపారు. ప్రతి నీటి బొట్టునూ సంరక్షించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఊరురా కళాకారులతో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్మించుకున్న వారి బిల్లుల చెల్లింపులు తక్షణమే చెల్లించాల న్నారు. రాష్ట్రాన్ని బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రంగా ప్రకటించనున్నామన్నారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ముమ్మరంగా కసరత్తు జరుగుతున్నది. ఉమ్మడి జిల్లాల ప్రజల అంధత్వ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ కంటి వెలుగు కార్యక్రమం మంచి ఫలితాన్ని ఇచ్చిందన్నారు. మండలాలు, గ్రామీణ ప్రాంతాల వారీగా వైద్య బృందాలు బాగా పనిచేశాయని అన్నారు.

## పండగ సమయాల్లో ప్లాస్టిక్‌కు దూరంగా ఉండండి

### మహిళలకు కలెక్టర్ సూచన

ఆదిలాబాద్,ఆగస్ట్8(ఆర్‌ఎన్‌ఎ): పండగల సమయంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా దూరంపెట్టాలని కలెక్టర్ దివ్యాదేవరాజన్ మహిళలకు సూచించారు. ప్లాస్టిక్ అనర్థాలు తెలుసుకుని దాని వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. శావణ శుక్రవారం,వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆమె శుబాకాంక్షలు తెలిపారు. అలాగే ప్లాస్టిక్ వాడకంతో కలిగే ఇబ్బందులను తోటి మహిళలతో చర్చించాలన్నారు. బట్టసంచులతో పాటు,నార సంచులను వినియోగించాలన్నారు. వ్రతాలు,నోములు, పండగల్లో అయినా ప్లాస్టిక్ వాడకుండా శపథం తీసుకోవాలని,మహిళలకు మాత్రమే ఇది సాధ్యమన్నారు. అలాగే బక్రీద్, రక్షాబంధన్ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 12న జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా అంతా సహకరించి ముందుకు సాగాలన్నారు. పండుగ సమయంలో వ్యర్థాలను రోడ్లపై వేసి ఇతరులకు ఇబ్బంది కలిగిం చవద్దని సూచించారు. పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని తెలిపారు. ఇదిలావుంటే హరితహారం కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేసి ఉద్యమంలా మొక్కలను నాటించాలని సూచించారు. అన్ని నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున మొక్కలను నాటించాలని సూచించారు. రైతులకు వ్యవసాయ అనుబంధ మొక్కలు పంపిణీ చేసి పొలంగట్లపై నాటించాలన్నారు. వెదురు, గంధం మొక్కలను రైతులతో నాటిస్తే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి లభిస్తుందన్నారు. నాటిన మొక్కలన్నింటినీ సంరక్షించే బాధ్యత ప్రతి పౌరుడు తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో సర్పంచులు, మున్సిపల్ కేంద్రాల్లో కౌన్సిలర్లదే సంరక్షణ బాధ్యత అని సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ దివ్యదేవరాజన్ అధికారులు, సర్పంచులను ఆదేశించారు. జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రత్యేకాధికారులను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించి మరుగుదొడ్ల స్థితిగతులను తెలుసుకోవాలని ఆదేశించారు. సర్పంచుల సహకారంతో మరుగుదొడ్లను పూర్తి చేయించాలన్నారు. జలశక్తి అభియాన్ ద్వారా ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించాలన్నారు.

# తెలంగాణ రైతులకు శుభవార్త!

### - రైతుబీమా పథకం మరోఏడాది కొనసాగింపు
### - 2020 ఆగస్టు 13వరకు పథకం కొనసాగింపు
### - 31.10లక్షల మంది రైతులకు లబ్ధి

హైదరాబాద్, ఆగస్టు8(ఆర్ఎన్ఎ) : తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రైతుబీమా పథకాన్ని మరో ఏడాది పాటు కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2019 ఆగస్టు14వ తేదీ నుంచి 2020 ఆగస్టు 13వరకు ఈ పథకం కొనసాగనుంది. 31.10 లక్షల మంది రైతులకు రైతుబీమా పథకం అమలవుతుంది. ఒక్కో రైతుకు రూ. 3013.50 ప్రీమియంతో రూ. 5 లక్షల బీమా చేసింది ప్రభుత్వం. ప్రీమియంతో పాటు జీఎస్టీ, స్టాంప్ డ్యూటీని ప్రభుత్వమే చెల్లించనుంది. రూ. 934.19 కోట్లతో రైతుబీమా పథకం కొనసాగింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతుబీమా పథకాన్ని పొడిగించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. గతేడాది ఆగస్టు 15వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుబీమా పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. నాడు ప్రారంభించిన రైతుబీమా పథకం.. ఈ ఏడాది ఆగస్ట్ 13 వరకు వర్తించనుంది. గడువు ముగిసే సమయం దగ్గర పడుతుండడంతో మరో ఏడాది పాటు ఈ పథకాన్ని కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏ కారణంతోనైనా రైతు చనిపోతే.. నామినీకి 10 రోజుల్లోగా 5 లక్షల బీమా పరిహారం ఎల్ఐసీ నుంచి అందుతుంది.

## వరంగల్ నిట్‌లో విద్యార్థి ఆత్మహత్య

వరంగల్, ఆగస్టు8 (ఆంఎన్ఎ) : వరంగల్ నిట్‌లో బుధవారం విషాదం చోటుచేసుకుంది. బీటెక్ విద్యార్థి ఆత్మహత్య ఘటన బుధవారం కలకలం రేపింది. బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న కౌశిక్ పాండే (20) అనే విద్యార్థి వసతి గృహంలోని తన గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కౌశిక్ తన అడ్మిషన్ రెన్యువల్ చేసుకునేందుకు ఇటీవలే తన తండ్రితో కలిసి నిట్‌కు వచ్చాడు. బుధవారం తన గదిలోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తోటి విద్యార్థి మృతిచెందడంతో నిట్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి. కౌశిక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# మధుప్రకాశ్ భార్య ఆత్మహత్యపై అనుమానాలు

### - భర్త మధుప్రకాశ్ వేధింపులే కారణం
### - పోలీసులకు ఫిర్యాదుచేసిన భారతి కుటుంబసభ్యులు
### - మధుప్రకాశ్‌ను అరెస్టుచేసిన పోలీసులు

హైదరాబాద్, ఆగస్టు8(ఆర్ఎన్ఎ): సీరియల్ నటుడు మధుప్రకాశ్ భార్య ఆత్మహత్య కేసు సంచలనంగా మారింది. భారతి ఆత్మహత్యకు భర్త మధు వేధింపులే కారణం అని భారతి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మణికొండ పంచవటి కాలనీలో 'కుంకుమపువ్వు' సీరియల్ ఫేమ్ మధు ప్రకాష్ భార్య భారతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మధుప్రకాశ్‌తో గుంటూరుకు చెందిన భారతికి 2015లో వివాహమైంది. ఆమె ఓ ప్రయివేట్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. అయితే తనను పట్టించుకోవడం లేదని, షూటింగ్‌ల నుంచి ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడంటూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన భారతి.. మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా హాస్పిటల్ కు తీసుకెళ్లారు. ఇదిలాఉంటే మధు ప్రకాష్ హత్య చేసి ఆత్మహత్యగా నమ్మిస్తున్నాడంటూ భారతి తల్లి ఆరోపించారు. అతడికి మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని.. ఆమె పరిచయం అయినప్పటి నుంచి మధు ప్రకాష్ తన కూతురు నిర్లక్ష్యం చేస్తున్నాడని తెలిపారు. రెండేళ్లగా భారతిని వేధింపులకు గురి చేస్తున్నాడని, చాలాసార్లు ఇద్దరి మధ్య గొడవలు జరిగితే సర్దిచెప్పే ప్రయత్నం చేశామని చెప్పారు. రూ.15 లక్షలు కట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి చేశామని చివరికి కూతురు చావుకు కారణం అయ్యాడన్నారు. కూతురి మృతికి కారణమైన మధు ప్రకాష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై మధుప్రకాశ్ స్పందించారు. తనకి, తన భార్యకి మధ్య గొడవలు ఉన్నాయని చెప్పారు. తాను సీరియల్స్ లో నటించడం తన భార్యకి ఇష్టం లేదన్నారు. పిల్లలు లేకపోవడంతో భారతి మానసిక పరిస్థితి సరిగా లేదన్నారు. డిప్రెషన్ లోకి వెళ్లి భారతి సూసైడ్ చేసుకుందని చెప్పారు. పెళ్లి జరిగినప్పటి నుంచి భారతి తనను ఇబ్బందులకు గురి చేసిందని మధుప్రకాశ్ వాపోయారు. షూటింగ్ లు ఉండటంతో సమయానికి ఇంటికి రాలేకపోయానని, దీంతో భారతి గొడవపడేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో చాలాసార్లు ఆత్మహత్య చేసుకుంటానని భారతి చెప్పిందని మధు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ఫోన్ చేసి సూసైడ్ చేసుకుంటానని భారతి చెప్పిందని మధు వెల్లడించారు. ఇదిలా ఉంటే భారతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టీవీ నటుడు మధుప్రకాశ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అదనపు వరకట్నం వేధింపుల కేసులో అతడిని రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# శ్రీరాంసాగర్‌కు గుదిబండగా పూడిక

### ఏటేటా పూడిక పెరుగుతోందన్న రైతులు
### చక్కదిద్దేయత్నాలు చేయలేదని ఆరోపణలు

నిజామాబాద్,ఆగస్ట్8 (ఆర్ఎన్ఎ): శ్రీరాంసాగర్‌కు పూడిక ముప్పు ముంచుకొస్తుంది. ఏటా ప్రాజెక్ట్‌లోకి భారీ వరదల వలన వచ్చే మట్టి తో ప్రాజెక్ట్‌లో భారీగా పూడిక పేరుకు పోతోంది. ఫలితంగా ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం ఏటేటా తగ్గుతోంది. మొదట్లో 112 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్ట్ నిల్వ సామర్థ్యం ప్రస్తుతం 80 టీఎంసీలకు పడిపోయింది. ప్రాజెక్ట్‌లో పూడిక తొలిగించి ఆయకట్టును కాపాడాల్సి ఉంది. ఎస్సారెస్పీలో పేరుకు పోయిన పూడికను వరదల ద్వారా తొలిగించేందుకు ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలోనే ఆరు ఆరు రివర్స్ స్లూయిజ్ గేట్లను నిర్మించారు. కానీ, ప్రాజెక్ట్ నుంచి ఇన్నేళ్లు వందల టీఎంసీల నీరు గోదావరి పాలు చేసినా, ఏ రోజు కూడా ఈ గేట్లను ప్రాజెక్ట్ అధికారులు వినియోగించలేదు. రివర్స్ స్లూయిజ్ గేట్లు పూర్తిగా మట్టిలో కూరుకు పోయాయి. గేట్లను ఎత్తితే కిందకు దిగే పరిస్థితి లేకపోవడంతో అధికారులు అటు వైపు ఏనాడు కన్నెత్తి చూడలేదు. ఫలితంగా ఎస్సారెస్పీలో పూడిక భారీగా పేరుకు పోయిందన్న విమర్శలకు సమాధానం లేదు. శ్రీరాంసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల సమయంలో పూడిక సమస్యపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా పూడిక చేరడంతో ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం పడిపోతోందని అంటున్నారు. ఎండాకాలంలో నీటినిల్వలు పడిపోయి నప్పుడు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గతేడాది తగినంత నిల్వలు లేని కారణంగా నీటిని విడుదల చేయలేమని ప్రభుత్వం చెప్పడంతో అప్పట్లో ఆందోళనలు సాగాయి. నీటి నిల్వ సామర్థ్యంపై ఇటు ప్రభుత్వం, అటు అధికారులు గోప్యత పాటిస్తున్నారో అంత చిక్కని రహస్యంగా మారింది. వాస్తవానికి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేందుకు ముందుకు రాని ప్రభుత్వం.. పూడికను పరిగణనలోకి తీసుకోకుండా ఎప్పుడో రెండు దశాబ్దాల క్రితం నాటి లెక్కలు చెబుతుండడం పై ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లో ప్రస్తుత నీటి నిలువ సామర్థ్యం ఎంత... ప్రస్తుతం ఎంత నీరు నిల్వ ఉందని రైతులు ప్రశ్నిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యమెంత..? పేరుకుపోయిన పూడిక ఎంత? అనే దానిపై అనుమానాలెన్నో వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 112 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఎస్సారెస్పీలో ప్రస్తుతం పెద్ద మొత్తంలో పూడిక పేరుకుపోయింది. 1994లో నిర్వహించిన సర్వే ప్రకారం 22 టీఎంసీల మేర పూడిక పేరుకు పోయినట్లు తేలింది. అప్పటి నుంచి ఇప్పటికీ అవే లెక్కల ప్రకారమే నీటి నిల్వల గురించి చెబుతున్న అధికారులు.. 2014-2015లో నిర్వహించిన సర్వే నివేదికను మాత్రం బయట పెట్టడం లేదు. దీనిపై సర్కారు కూడా నోరు మెదవట్లేదు. ఎందుకంటే ఎస్సారెస్పీ నిల్వ సామర్థ్యం దారుణంగా పడిపోయిందని అప్పట్లో సర్వే నిర్వహించిన సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ప్రాజెక్టు సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందని స్పష్టం చేసింది. అయితే, ఈ నివేదికను ఇటు సర్కారు, అటు అధికారులు బయట పెట్టడం లేదు. పూడిక తొలగింపునకు చర్యలు చేపట్టడం లేదు. 2015 జనవరిలో నిర్వహించిన పూడిక సర్వేలో ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందని తేలింది. ఆ నివేదిక ప్రకారమైతే, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 15.93 టీఎంసీల నీరు నిల్వ ఉండదు. అందుకనే, సర్కారు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం లేదని కాకతీయ కాలువ పరివాహక ప్రాంత రైతులు చెబుతున్నారు. 1994లో నిర్వహించిన సర్వే నివేదిక ఆధారంగానే ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యాన్ని ప్రాజెక్ట్ అధికారులు 90 టీఎంసీలుగా పేర్కొంటున్నారు. అయితే, గత 24 ఏళ్లలో ప్రాజెక్ట్‌కు భారీ వరదలు వచ్చాయి. వరదలతో పాటు పూడిక వచ్చి చేరింది. కానీ, అధికారులు రెండు దశాబ్దాల క్రితం నాటి లెక్కలే చెబుతుండడం విశేషం. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయిందని ఆ సంస్థ తన నివేదికలో వెల్లడించింది. కానీ అధికారులు ఆ నివేదికను పరిగణనలోకి తీసుకోకుండా ఇప్పటికీ 90 టీఎంసీల సామర్థ్యంలోనే లెక్కలు చూపుతున్నారు. పూడిక ఎంతుందో బయట పెట్టకుండా నీటి నిల్వలపై కాకి లెక్కలు చూపుతున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఎస్సారెస్పీలో అసలు నిల్వ ఎంత ఉందో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

## సుష్మ హఠాన్మరణం కలచివేసింది

### ఓ అంకితమైననేతను కోల్పోయిన దేశం: మన్మోహన్

న్యూఢిల్లీ,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ హఠాన్మరణం తనను షాక్‌కు గురిచేసినట్లు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో తనకు బాగా తెలునని మన్మోహన్ అన్నారు. సుష్మా మృతికి నివాళి అర్పిస్తూ మన్మోహన్ ట్విట్టర్‌లో ఈ విషయాన్ని తెలిపారు. సుష్మా ఉన్నత విలువలు ఉన్న వ్యక్తి అని, పార్టీలకు అతీతంగా నేతలంతా ఆమెను గౌరవిస్తారన్నారు. ఆమె గొప్ప పార్లమెంటరీ నేత అని, ఆమె నైపుణ్యం కూడా అమోఘమైందన్నారు. దేశం ఓ అంకితమైన నేతను కోల్పోయిందన్నారు.

### సుష్మాకు నివాళి అర్పించిన బధిర బాలిక

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకురాలు, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ మృతిపట్ల పాక్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన బధిర అమ్మాయి గీత మూగసైగలతో నివాళు లర్పించారు. 2000 సంవత్సరంలో పొరపాటున సరిహద్దు దాటి 15 సంవత్సరాల పాటు కరాచీ నగరంలో నివసించిన బధిర బాలిక గీతను నాటి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రిగాఉన్న సుష్మా స్వరాజ్ చొరవ తీసుకుని 2015లో భారత్‌కు తీసుకొచ్చిన విషయం విదితమే. దీంతో గీతకు సుష్మాస్వరాజ్ మధ్య ప్రేమపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయి. గత రాత్రి సుష్మా స్వరాజ్ మృతి చెందారన్న వార్త తెలుసుకున్న గీత కన్నీరు పెట్టుకుంది. గీత సంతాపం తెలుపుతున్న సమయంలో ఆమె పక్కన ఓ మహిళ సుష్మా స్వరాజ్ ఫోటో పట్టుకుని నిల్చున్నారు. 2000, నవంబర్ నెలలో గీత పాక్‌లోకి ప్రవేశించింది. ప్రస్తుతం గీత మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో నివసిస్తోంది.

# ఐక్యంగా పోరాడితేనే.. సమస్యలు పరిష్కారమవుతాయి

### - 72ఏండ్లు అవుతున్నా బీసీలు ఇంకా ఆక్రోశిస్తూనే ఉన్నారు
### - తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్

హైదరాబాద్,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు.

బుధవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో లో నాలుగోవ జాతీయ ఓబీసీ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ఈటెల రాజేందర్ హాజరై బీసీల సమస్యలపై మాట్లాడారు. బీసీలు ఎప్పుడూ ఏవోవో మీటింగ్ లు పెట్టుకుంటరని చాలా మంది మాట్లాడుతుంటరని, అయితే భంగ పడ్డ వాళ్లకు, అన్యాయం జరిగిన వాళ్లకు సంఘాలు ఉంటాయని, వారు తమ సమస్యలపై పోరాటం కోసమే సమావేశాలు జరుపుతారని ఆయన అన్నారు. బీసీలకు కావాల్సింది తాయిలాలూ, బిక్షం కాదని, రాజ్యాధికారం, హక్కులు కావాలని అన్నారు. ఐక్యంగా పోరాడుతేనె సమస్యలు పరిష్కారం అవుతాయని, కొట్లాడుతేనే హక్కులు వస్తాయని ఆయన అన్నారు. పోరాడితే పోయేది ఏమి లేదు బానిస సంకెళ్లు తప్ప అని అన్నారు. బీసీ లకు 27శాతం రిజర్వేషన్లు ఉంటే 6శాతం నుంచి 11శాతం వరకే అమలు అవుతున్నాయన్న ఈటెల.. స్వాతంత్ర్యం వచ్చి 72 ఏండ్లు అవుతున్నా బీసీ లు ఇంకా ఆక్రోశిస్తూనే ఉన్నారన్నారు. ఓపన్ కాంపిటీషన్ లో బిసి లు సీట్లు కోల్పోతున్నారని, దీనిపైన పాలకులు ఆలోచించాలన్నారు. బీసీ సమస్యల పరిష్కారం కోసం తమ సహకారం ఉంటుందని ఈటెల అన్నారు. ఈ కార్యక్రమానికి సినీ నటుడు సుమన్, పలువురు బీసీ ఎమ్మెల్యే లు, తెలంగాణ, ఏపీ, ఇతర రాష్ట్రాలకు చెందిన బీసీ ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నేతలు హాజరయ్యారు.

# అశ్రునయనాల మధ్య చిన్నమ్మకు వీడ్కోలు

### లోధీ శ్మశాన వాటికలో అంత్యక్రియలు
### హాజరైన ప్రధాని మోడీ, వెంకయ్య, అద్వానీ
### కడసారి చూపు కోసం తరలి వచ్చిన మంత్రులు,నేతలు

న్యూఢిల్లీ,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): అశ్రునయనాల మధ్య అశేష నాయకులు నివాలి అనంతరం భాజపా సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ అంత్యక్రియలు ముగిశాయి. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల అశ్రు నయనాల మధ్య ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. మంగళవారం రాత్రి తీవ్ర గుండెపోటు రావడంతో దిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూసిన సుష్మా స్వరాజ్ పార్థివ దేహాన్ని తొలుత ఆమె నివాసానికి తరలించారు. అనంతరం బుధవారం ఉదయం కార్యకర్తలు, నేతల సందర్శనార్థం భాజపా కేంద్ర కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ పలువురు కేంద్రమంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం అభిమానులు, కార్యకర్తల అశ్రు నయనాల మధ్య దిల్లీ వీధుల్లో సుష్మా స్వరాజ్ అంతిమ యాత్ర కొనసాగింది. అనంతరం లోధి రోడ్డులోని శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో ఆమె పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఢిల్లీలోని లోధీ శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేపట్టారు. విద్యుత్తు శ్మశాన వాటికలో సుష్మా పార్థివదేహానికి నిప్పుపెట్టారు. ఇటీవల మరణించిన ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్‌కు కూడా ఇదే తరహాలో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రధాని మోదీతో పాటు పలువురు క్యాబినెట్ మంత్రులు లోధీ శ్మశానవాటికకు చేరుకుని తుదివీడ్కోలు తెలిపారు. సుష్మా కూతురు బాన్సురి స్వరాజ్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పార్థీవదేహాన్ని ఎలక్ట్రిక్ క్రిమటోరియంలోకి తరలించే ముందు ప్రభుత్వ లాంఛనాల ప్రకారం తుపాకులను గాలిలోకి పేల్చారు. సుష్మాస్వరాజ్ అంతిమ సంస్కారాలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ, పార్టీ అగ్రనేత ఎల్‌కే ఆద్వాణీ, భాజపా జాతీయ అధ్యక్షుడు,కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రవిశంకర్ ప్రసాద్, ప్రకాశ్ జావడేకర్, నితిన్ గడ్కరీ, స్మృతి ఇరానీ కాంగ్రెస్ సీనియర్ నేతలు అశోక్ గహ్లోత్, గులాం నబీ ఆజాద్, ఆనంద్ శర్మ, లోక్‌తాంత్రిక్ జనతాదళ్ నేత శరద్ యాదవ్, పలు పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారు. సుష్మా స్వరాజ్ మృతిపట్ల దేశ, విదేశీ ప్రముఖులు సంతాపం తెలిపారు. దేశం ఓ గొప్ప రాజకీయ నేతను కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. భారత రాజకీయాల్లో ఒక ఉజ్వల అధ్యాయం ముగిసిందని విచారం వ్యక్తంచేశారు.

# రైతులందరికీ పాస్ పుస్తకాలు అందచేత

### కాళేశ్వరంతో అన్ని చెరువులకు నీరు
### నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది

వరంగల్ రూరల్,ఆగస్టు7 (ఆర్ఎన్ఎ): రాబోయే 45 రోజుల్లో నర్సంపేట డివిజన్‌లోని రైతులందరికీ వందశాతం పాస్‌పుస్తకాలను అందజేస్తామని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రైతులకు ఏ సమస్య వచ్చినా తీర్చేందుకు ముందుంటానని అన్నారు. నర్సంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరు మండలాలకు చెందిన 1669 మంది రైతులకు పట్టా పాస్‌పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు 96 శాతం మంది రైతులకు పాస్ పుస్తకాలను అందజేశామన్నారు. మిగిలిన రైతులకు కూడా అందించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఆయన వివరించారు.

గ్రామాలకు ప్రధాన ఆధారంగా ఉన్న అన్ని చెరువులకు గోదావరి జలాలను తరలించి, ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు.గోదావరి నదిపై మూడేళ్లలోనే అత్యంత అద్భుతంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన ఘనత సిఎం కెసిఆర్‌దని తెలిపారు. ప్రాజెక్టు ద్వారా తెలంగాణలోని అన్ని జిల్లాలకు సాగు నీటిని సరఫరా చేసేందుకు కాల్వల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో సాగునీరు లేక పల్లెల్లో వ్యవసాయం జీర్ణావస్థకు చేరుకుందన్నారు. కానీ తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం, సాగునీటి రంగానికి ప్రాధాన్యతనిస్తుండడంతో పట్టణాలకు వలసపోయిన ప్రజలు తిరిగి పల్లెలకు వస్తున్నారన్నారు. త్వరలోనే అన్ని చెరువులకు నీరువచ్చి పంట పొలాలు పచ్చగా మారుతాయన్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన తెలంగాణ గొలుసుకట్టు చెరువులకు మిషన్ కాకతీయతో ప్రభుత్వం జీవం పోసిందని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వాలు కనీసం చెరువులో పూడికమట్టిని కూడా తీయించకపోవడంతో నీటి సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవి, ఏడీఏ శ్రీనివాసరావు, ఆరు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు మూడురోజుల వరుస సెలవులు

హైదరాబాద్,ఆగస్టు8 (ఆర్ఎన్ఎ): వరలక్ష్మి వ్రతంసందర్భంగా శుక్రవారంతో పాటు వరుసగా మూడు రోజులు సెలవులు కలసి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వరుసగా మూడు రోజులు సెలవులు

రానున్నాయి. ఈ మూడు సెలవులతో పాటు మరో రోజు మహిళలకు కలిసి రానుంది. శ్రావణ మాసం ఆరంభం కావడంతో.. ఈ శుక్రవారం(ఆగస్టు 9) మహిళలు వరలక్ష్మి వ్రతం చేసుకుంటారు. దీంతో మెజార్టీ మహిళలు ఆ రోజు సెలవు తీసుకునే అవకాశం ఉంది. మొత్తంగా మహిళలకు నాలుగు రోజులు సెలవులు కలిసి రానున్నాయి. ఆగస్టు 9న శ్రావణ శుక్రవారం, 10న రెండో శనివారం, 11న ఆదివారం, 12న బక్రీద్ సెలవు ఉంది. ఉద్యోగులు, బ్యాంకర్లకు కూడా వరుస సెలవులు కలసిరానున్నాయి.

# పసిడి ధర మరింత పెరిగే అవకాశం!

### అంతర్జాతీయ పరిణామాలే కారణమంటున్న విశ్లేషకులు

న్యూఢిల్లీ,ఆగస్ట్8(ఆర్ఎన్ఎ): బడ్జెట్ తర్వాత పసిడి ధర భారీగా పెరుగుతూ వస్తోంది. బంగారం దిగుమతులపై కస్టమ్స్ సుంకం 2.5 శాతం పెంచడంతో ధర శరాఘాతంగా మారింది. ప్రస్తుతం 24 కేరట్ల 10 గ్రాముల ధర ఏకంగా రూ.40 వేలు దాటింది. బంగారం భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. అయితే భవిష్యత్తులో బంగారం ధర తగ్గుతుందా అంటే మాత్రం, సమీప భవిష్యత్తులో మాత్రం అవకాశం లేదనే చెప్పాలి. ఎందుకంటే, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులకే ఇందుకు కారణం, భవిష్యత్తులో బ్రెగ్జిట్ అంశం మార్కెట్లను కలవరపరచడం, దేశీయంగా డిమాండ్ పెరగడం, మాంద్యం పరిస్థితుల నేపథ్యంలో బంగారం అంతకంతకు ధర పెరుగుతుందే తప్ప దిగే సూచనలు కనిపించడం లేదు. అలాగే రూపాయి మరింత బలపడే అవకాశాలు సైతం తక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో బంగారం ధరలు పెరగవచ్చని బులియన్ మార్కెట్ నిపుణులు చెప్తున్నారు.ఇక బంగారం ధర పెరగడానికి గల కారణాలు చూస్తే.. మన దేశంలో బంగారంలో సింహభాగం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటాము. అయతే బంగారం కొనుగోలు చేసేందుకు విదేశీ మారక ద్రవ్యంలోని డాలర్ల రూపంలో చెల్లిస్తున్నాం. ఎప్పుడైదే డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలహీన పడుతుందో, అప్పుడు దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు పెరుగుతాయి. రూపాయి బలపడితే బంగారం ధరలు తగ్గుతాయి. అయితే రూపాయి విలువ తగ్గితే బంగారం ధరలు కూడా పెరుగుతాయి. అంతర్జాతీయంగా అమెరికా, చైనాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధంతో పసిడి ధరలు ఒక్కసారిగా ఎగిసాయి. వాణిజ్య యుద్ధం నేపథ్యంలో మదుపరులు తమ సంపదను బంగారంపై పెట్టుబడి పెట్టడమే సురక్షితంగా భావిస్తున్నారు. దీంతో బంగారం ధరలు పెరుగుతున్నాయి. ధరలు భారీగా పెరిగే అవకాశం కనిపిస్తోంది. మరో ఆరు నెలల్లో బంగారం ఊహకు అందనంత రేంజిలో పెరిగిన ఆశ్చర్యపోనవసరం లేదని అంటున్నారు. అయితే దీర్ఘకాలంలో అంతర్జాతీయ పరిస్థితులను కచ్చితంగా అంచనా వేయలేని నేపథ్యంలో బంగారం పెట్టుబడులపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ధరలో హెచ్చు తగ్గులు వచ్చినప్పుడు తప్పకుండా ఫిజికల్ బంగారం కొనుగోలు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ముఖ్యంగా భారతీయులకు బంగారంతో విడదీయరాని బంధం ఉంది. పెళ్లిల్లు, పర్వదినాల్లో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం. అందుకే బంగారం కొనుగోలు అత్యవసరం అనుకుంటే మాత్రం ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇక పెట్టుబడి రూపంలో బంగారంపై ఇన్వెస్ట్ చేసుకోవాలంటే, మీ పోర్ట్ ఫోలియోలోని మొత్తం పెట్టుబడుల్లో బంగారంపై 5-10 శాతం కంటే ఎక్కువగా ఉండకూడదు. పోర్ట్‌ఫోలియోలో పసిడి పెట్టుబడులు సైతం భాగం కావాలి. ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా రెగ్యులర్‌గా బంగారం కొనుగోలు చేస్తుండాలి. అలాగే ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన సావరీన్ గోల్డ్ బాండ్ల ద్వారా పెట్టుబడులు పెట్టడం సరైన నిర్ణయమని సూచిస్తున్నారు. దీనిపై వార్షికంగా వడ్డీ 2.5 శాతం అందిస్తారు. ఇక ఈటీఎఫ్ లేదా డిజిటల్ గోల్డ్ రూపంలో కూడా పెట్టుబడులు పెట్టవచ్చు.

## ఇల్లు ఖాళీచేయించడంతో మహిళ ఆత్మహత్యాయత్నం

ఖమ్మం,ఆగస్ట్8 (ఆర్ఎన్ఎ): డబుల్ బెడ్రూమ్ ఇళ్లను అధికారులు ఖాళీ చేయించడంతో మనస్తాపానికి గురైన ఒక మహిళ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఖమ్మం జిల్లాలోని ముసలమడుగు గ్రామంలో పలు ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో గ్రామస్తులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఆశ్రయం పొందుతున్నారు. అయితే విషయం తెలుసుకున్న అధికారులు డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఖాళీ చేయించారు. దీంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు

## కాశ్మీర్‌పై లెఫ్ట్ నేతల ఆందోళన

హైదరాబాద్,ఆగస్టు7(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్ స్వయంప్రతిపత్తిని రద్దు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని కమ్యూనిస్ట్ పార్టీలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాయి. బుధవారం హైదరాబాద్‌లో లెఫ్ట్ పార్టీలు అన్ని కలిసి భారీ స్థాయిలో ర్యాలీ చేపట్టాయి. కాగా, ర్యాలీ చేస్తున్న లెఫ్ట్ నేతలు సురవరం,తమ్మినేనిని పోలీసులు అరెస్టు చేశారు. కశ్మీర్ స్వయంప్రతిపత్తిపై బీజేపి నిరంకుశత్వంగా వ్యవరహరించిందని వారు విమర్శించారు. ప్రజలతో చర్చించకుండా,నేతలతో సంప్రదించకుండా దుర్మార్గమైన చర్య తీసుకున్నారని మండిపడ్డారు.

# ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతపై ముగిసిన వాదనలు

### తీర్పును రిజర్వ్‌లో పెట్టిన హైకోర్టు
### తెలంగాణ అసెంబ్లీ నిర్మాణాలపై కోర్టులో వాదనలు

హైదరాబాద్,ఆగస్ట్8 (ఆర్ఎన్ఎ): తెలంగాణలో కొత్త అసెంబ్లీ నిర్మాణం కోసం ఎర్రమంజిల్ భవనాల కూల్చివేత కేసులో హైకోర్టులో వాదనలు ముగిశాయి. గత నెల రోజులుగా పలు దఫాలుగా కొనసాగిన వాదనలను విన్న ఉన్నత న్యాయస్థానం దీనిపై తీర్పును రిజర్వులో ఉంచింది. ప్రభుత్వం నుంచి వివరాలుఅడిగి తీసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఎందుకు ఎర్రమంజిల్ కూల్చేస్తున్నారో చెప్పాలని కూడా హైకోర్టు ప్రశ్నించింది. అలాగే అభివృద్ధి పనులను అడ్డుకోలేమని కూడా పిటిషనర్లకు స్పష్టం చేసింది. మొత్తంగా వాదనలు ముగియడంతో తీర్పు ఏ విధంగా ఉంటుందన్న ఆసక్తి నెలకొంది. 2010లో హెచ్ఎండీఏ సమర్పించిన మాస్టర్ ఎ÷-లాన్‌లో ఎర్రమంజిల్ పురాతన కట్టడంగా ఉందని ఉన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రెగ్యులేషన్ 13 రద్దు చేసే అవకాశం ప్రభుత్వానికి లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 183 చట్టవిరుద్ధమని తెలిపారు. చారిత్రక కట్టడాల జాబితాను రద్దుచేస్తూ ప్రభుత్వం 183 జీవో ఇచ్చింది. ఎర్రమంజిల్ భవనాల కూల్చివేతపై జులై 3 నుంచి హైకోర్టులో పలు దఫాలుగా వాదనలు కొనసాగగా.. పిటిషనర్ల తరఫు న్యాయవాది మాత్రం భవనాల కూల్చివేతసి కొత్త భవనం నిర్మించడానికి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. కొత్త భవనం నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పాటు పురాతన కట్టడాలను పరిరక్షించాల్సిన రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతను విస్మరించినట్టవుతుందని పేర్కొంటూ వచ్చారు. పురాతన ఎర్రమంజిల్ భవనం కూల్చివేసి కొత్త అసెంబ్లీ భవనం నిర్మించడం సరైంది కాదని వారు వాదించారు. ఇందుకు సంబంధించి పలు రాష్ట్రాల హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సైతం ప్రస్తావించారు. అసంబద్ధంగా 183 జీవో తీసుకొచ్చారని వాదించారు.

తెలంగాణ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం గనక కొత్త భవనాలు నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అదనపు అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ భవనం అసెంబ్లీ కోసం నిర్మించిన భవనం కాదని.. సుమారు 100 ఏళ్ల క్రితం నిర్మించిన హాలును అసెంబ్లీ కోసం వినియోగిస్తున్నామన్నారు. రాష్ట్ర అవసరాల దృష్ట్యా అధునాతనంగా అసెంబ్లీ భవనం నిర్మించాలని భావించడం వల్ల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని.. ఇందులో భాగంగానే ఎర్రమంజిల్‌లో నూతన భవనాల నిర్మాణం చేపట్టిందని వాదించారు. ప్రభుత్వం తీసుకొనే ఆర్థిక సంబంధమైన నిర్ణయాల్లో హైకోర్టు జోక్యం చేసుకోరాదనే పలు తీర్పులను అదనపు ఏజీ హైకోర్టు ముందు ఉంచారు. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది.

# ప్రభుత్వ బంగళాల్లో మాజీ సీఎంల తిష్ట

### స్వాధీనం చేసుకునేందుకు యత్నాలు?

శ్రీనగర్,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): జమ్మూ-కశ్మీరు విభజన, అధికరణ 370 రద్దు తరవాత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తదుపరి లక్ష్యం ఏమిటనేదానిపై చాలా ఊహాగానాలు వస్తున్నాయి. జమ్మూ-కశ్మీరు మాజీ ముఖ్యమంత్రులు నివసిస్తున్న ప్రభుత్వ లను కూడా స్వాధీనం చేసుకుంటారని అంటున్నారు.

మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, ముఫ్తీ మహమ్మద్ సయీద్, గులాం నబీ ఆజాద్ ప్రస్తుతం ప్రభుత్వ బంగళాల్లో నివసిస్తున్నారు. వీరిలో ఆజాద్ మినహా మిగిలినవారు తాము అధికారంలో ఉన్నపుడు తమకు కావలసినట్లుగా మార్పులు చేసుకున్నారని, మొత్తం మీద రూ.50 కోట్లు ప్రభుత్వ ధనం ఖర్చయిందని తెలుస్తోంది. ఈ బంగళాలకు వీరు అ÷-దదె చెల్లించవలసిన అవసరం లేదు. మహబూబా ముఫ్తీ తండ్రి ముఫ్తీ మహ్మద్ సయీద్‌కు శ్రీనగర్ శివారులో నౌగాంలో ఓ సొంత ఇల్లు ఉంది. దీనిని ఆధునికంగా తీర్చిదిద్దేం దుకు రోడ్లు, భవనాల శాఖ భారీ మొత్తంలో ఖర్చు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా తన సొంతింట్లో ఉంటున్నప్పటికీ, తనకు మాజీ ముఖ్యమంత్రిగా ఓ బంగళాను పొందే హక్కు ఉందని, దానికి బదులుగా తనకు అద్దె చెల్లించాలని కోరుతున్నట్లు ఎస్టేట్స్ అధికారులు చెప్తున్నారు.మాజీ ముఖ్యమంత్రుల వద్ద పని చేసే సిబ్బందికి కూడా ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ మాత్రమే ప్రభుత్వ బంగళాలో నివసించడం లేదు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం రాజ్యాంగ పదవిని నిర్వహించినవారికి వారి జీవిత కాలమంతా అధికారిక నివాసం సదుపాయం లభిస్తుందనే హామీ ఉండదు. ఈ తీర్పు పరిధి నుంచి జమ్మూ-కశ్మీరు మాజీ ముఖ్య మంత్రులు తప్పించుకోవడానికి కారణం అధికరణ 370. దీనిని రద్దు చేయడంతో కేంద్ర ప్రభుత్వం ఇక ఈ ప్రభుత్వ బంగళాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంపై దృష్టి పెడుతుందని కొందరు భావిస్తున్నారు.

# శివాజీకి అమెరికా వెళ్లేందుకు అనుమతి

### మూడు వారాలు అనుమతించిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్టు8 (ఆర్ఎన్ఎ): అలంద మీడియా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీనటుడు శివాజీ అమెరికా వెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు మరోసారి అనుమతి ఇచ్చింది. ఇటీవల ఆయన అమెరికా వెళుండగా పోలీసులు అడ్డుకోవడంపై ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం ఉన్నత న్యాయస్థానం విచారించింది. అలంద మీడియా కేసులో జారీ అయిన లుకౌట్ నోటీసులు తొలగించాలని హైకోర్టు ఆదేశించినా పోలీసులు తొలగించలేదని శివాజీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో ఆయన అమెరికా వెళ్తుండగా పోలీసులు ఆపారన్నారు. దుబాయి ఇమ్మిగ్రేషన్ అధికారులు కూడా ఆపి వెనక్కి పంపారని వివరించారు. ఇమ్మిగ్రేషన్ వెబ్‌సైట్‌లో లుకౌట్ నోటీసులు తొలగించలేదన్నారు. దీన్ని కోర్టు ధిక్కరణగా పరిగణించాలని న్యాయవాది కోరారు. గత నెల 24న హైకోర్టు తీర్పు రావడంతో శివాజీ 25న అమెరికా వెళ్లారని పోలీసుల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. హైకోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాత లుకౌట్ నోటీసులు తొలగించడానికి మూడు రోజులు పడుతుందని తెలిపారు. హైకోర్టు ఆదేశాలు సీఐడీకి వెళ్లి అక్కడినుంచి ఇమిగ్రేషన్‌కు వెళ్లాలని పోలీసులు తెలిపారు. భారత్‌లో ఎవరూ కూడా శివాజీని ఆపలేదన్నారు. దుబాయ్ ఇమ్మిగ్రేషన్ సిబ్బంది ఆపారని తెలిపారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు.. ఇదంతా సమాచార లోపం వల్ల జరిగిన తప్పిదమని పేర్కొంది. మూడు వారాల వరకు అమెరికా వెళ్లేందుకు హైకోర్టు మరోసారి శివాజీకి అనుమతి ఇచ్చింది.

# స్వల్పంగా తగ్గిన గృహరుణాల వడ్డీలు

### ఆర్‌బిఐ పరపతి విధానంతో ఎస్‌బిఐ నిర్ణయం
### అదే బాటలోహెచ్‌డిఎఫ్‌సి ప్రకటన

న్యూఢిల్లీ,ఆగస్ట్8(ఆర్ఎన్ఎ): ఆర్బీఐ ద్రవ్య విధాన సమీక్ష ప్రకటనతో బ్యాంకులు వడ్డీరేట్లను కుదించేందుకు ముందుకు వచ్చాయి. భారతీయ స్టేట్ బ్యాంక్,హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులు తగ్గింపు రేట్లను ప్రకటించాయి. ఎస్‌బీఐ గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) కీలక వడ్డీ రేట్లను తగ్గించడంతో ఎస్‌బీఐ ఆ ప్రయోజనంలో కొంత భాగాన్ని తన ఖాతాదారులకు ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్బీఐ ద్రవ్య విధాన సమీక్ష ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే ఎస్‌బీఐ స్పందించింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసీఎల్ఆర్)ను 15 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు తెలిపింది. ఈ కొత్త రేట్లు ఆగస్టు 10 నుంచి వర్తిస్తాయని తెలిపింది. ప్రస్తుతం రుణ కాలపరిమితి ఓవర్‌నైట్ అయితే 8.05 శాతం ఎంసీఎల్ఆర్ ఉంది, దీనిని 7.90కి తగ్గించింది. ఒక నెల కాలపరిమితిగల రుణానికి 8.05 శాతం నుంచి 7.90 శాతానికి తగ్గింది. మూడు నెలలకు 8.10 శాతం నుంచి 7.95 శాతానికి తగ్గింది. ఇదేవిధంగా అన్ని కాల పరిమితుల రుణాలకు 0.15 శాతం తగ్గింది. ఆర్బీఐ 2019-20 మూడో ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్షను బుధవారం ప్రకటించింది. రెపో రేటును 35 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో మిగిలిన బ్యాంకులు కూడా ఎస్‌బీఐని అనుసరించే అవకాశం కనిపిస్తోంది. ప్రయివేటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కూడా రుణ రేటు 10 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గింది. అన్ని కాలపరిమితుల రుణ రేట్లు 0.10 శాతం తగ్గాయి. తాజా నిర్ణయం బుధవారం నుంచీ అమల్లోకి వస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా ద్రవ్య పరపతి విధాన సమీక్ష ప్రారంభమైన రెండవరోజు హెచ్‌డీఎఫ్‌సీ తాజా ప్రకటన చేయడం గమనార్హం. కాగా ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించిన నేపథ్యంలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ కూడా ఆటో, గృహ, వ్యక్తిగత రుణాలపై ఎంసీఎల్ఆర్‌ను 15 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపో (ప్రస్తుతం 5.75 శాతం) ను ఆర్‌బీఐ 35 పాయింట్ల మేర తగ్గించింది. దీంతో వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటు 5.4 శాతానికి దిగివచ్చింది.

# అత్యుత్సాహం వద్దు!

### - ఎల్వోసీలో అక్రమ చొరబాట్లకు సపోర్ట్ చేయడం ఆపేయండి
### - పాక్ గడ్డపై ఉగ్రవాద మూలాలపై చర్యలు తీసుకోండి
### - పాక్‌ను హెచ్చరించిన అమెరికా

వాషింగ్టన్, ఆగస్టు8(ఆర్ఎన్ఎ) : ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకశ్మీర్ విభజన విషయంలో పాకిస్తాన్ తీరుపై అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా స్పందించింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు రద్దు, దౌత్య సంబంధాలను తగ్గించుకోవడం, హైకమిషనర్ అజయ్ బిసారియా బహిష్కరణ తదితర అంశాలపైనా రియాక్ట్ అయ్యింది. జమ్మూకశ్మీర్ విషయంలో అత్యుత్సాహం వద్దని పాకిస్తాన్ కు అమెరికా వార్నింగ్ ఇచ్చింది. హద్దుల్లో ఉండాలని స్పష్టం చేసింది. రెండు దేశాల వైఖరిని తాము గమనిస్తున్నామని అమెరికా తెలిపింది. జమ్మూకశ్మీర్‌లో పరిపాలన, కేంద్ర పాలిత ప్రాంతాలు తదితర అంశాలపై భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా గమనిస్తోందని, ఆయా అంశాల్లో పురోగతులను మేము చూస్తూనే ఉన్నామని, పాకిస్తాన్ దూకుడు తగ్గించుకోవాలని సూచించింది. ఎల్వోసీలో అక్రమ చొరబాట్లకు సపోర్ట్ చేయడం ఆపేయాలని, పాక్ గడ్డ మీద ఉగ్రవాద మూలాలపై చర్యలు తీసుకోవాలని అమెరికా తేల్చి చెప్పింది.

జమ్మూకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 సహా పలు అధికారాలను భారత ప్రభుత్వం రద్దు చేయడంపై పాక్ తీవ్రంగా స్పందించింది. భారత్‌తో దౌత్య సంబంధాలు తగ్గించుకోవాలని నిర్ణయించింది. పాకిస్తాన్‌లో భారత రాయబారిని బహిష్కరించింది. పాక్ హై కమిషనర్‌ను భారత్‌కు పంపరాదని నిర్ణయించింది. పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ విషయంలో భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పుల్వామా తరహా ఉగ్రదాడులు మరిన్ని జరిగే అవకాశం ఉందన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం కూడా జరగొచ్చేమో అని ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. భారత్ పై ఇమ్రాన్ ఖాన్ విషం కక్కారు.

# భారీగా పెరిగిన బంగారం ధరలు

### అంతర్జాతీయ ప్రభావంతో భగ్గుమన్న రేట్లు

న్యూఢిల్లీ,ఆగస్టు8 (ఆర్ఎన్ఎ): శ్రావణమాసంలో మహిళలు ఎంతగానో ఇష్టపడి చేసుకునే వరలక్ష్మి వ్రతనానికి ముందే బంగారం ధరలు మరింత పరుగులుపెట్టాయి. దేశీయ మార్కెట్లో బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లతో పాటు దేశీయంగా డిమాండ్ ఊపందుకోవడంతో పసిడి ధర జీవనకాల గరిష్ఠానికి చేరింది. బుధవారం ఒక్కరోజే రూ. 1,113 పెరిగి రూ. 38వేల మార్క్‌కు చేరువైంది. దేశ రాజధానిలో పది గ్రాముల బంగారం ధర బుధవారం రూ. 37,920 పలికింది. అటు వెండి కూడా బంగారం దారిలోనే పయనించింది. పారిశ్రామిక వర్గాలు, నాణెళిల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఎక్కువగా ఉండటంతో నేడు రూ. 650 పెరిగింది. దీంతో బులియన్ మార్కెట్లో కేజీ వెండి ధర రూ. 43,670కి చేరింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో స్టాక్‌మార్కెట్లు భారీగా పతనమవు తున్నాయి. ఇలాంటి సమయంలో పసిడిలో పెట్టుబడులు పెట్టడమే శ్రయేస్కరమని మదుపర్లు భావిస్తున్నారు. ఫలితంగా బంగారం ధర ఆకాశాన్నంటుతోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. దేశీయ విపణిలో బంగారం ధర 38వేలకు చేరువవడం ఇదే తొలిసారి. అంతర్జాతీయంగానూ ఈ లోహల ధరలు పెరిగాయి. న్యూయార్క్ మార్కెట్లో ఔన్సు బంగారం 1,487.20 డాలర్లు, ఔన్సు వెండి 16.81 డాలర్లు పలికింది.

# ఢిల్లీలో బిజీగా సిఎం వైఎస్ జగన్

### రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిలతో భేటీ
### నిధుల విడుదలపై నిర్మలా సీతారామన్‌తో చర్చ

న్యూఢిల్లీ,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): ఏపీ ముఖ్యమంత్రి జగన్ రెండో రోజు పర్యటన ఢిల్లీలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం జగన్‌తో పాటు ఎంపీ విజయసాయిరెడ్డి, పలువురు ఎంపీలు ఆయనతో పాటు ఉన్నారు. తొలి రోజు పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని మోదీని కలిసిన సంగతి తెలిసిందే. నవరత్నాల అమలులో సహకరించాలని, ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. విభజన చట్టాన్ని అనుసరించి రావాల్సిన నిధుల అంశం ఈ భేటీలో చర్చకు వచ్చినట్టు సమాచారం. ఇక రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం ప్రధాని మోదీని కలిసిన సీఎం జగన్, బుధవారం మధ్యాహ్నం కేంద్ర ఉపరితల, రవాణాశాఖ

మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన సంగతి తెలిసిందే. విభజన చట్టంలో ఏపీకి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్ జగన్ వారి దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను సీఎం కలిశారు.

# ఏసిబి వలలో ముగ్గురు ఉద్యోగులు

మేడ్చల్,ఆగస్ట్8(ఆర్ఎన్ఎ): గుత్తేదారు నుంచి లంచం తీసుకుంటూ పంచాయతీ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో గుత్తేదారు నుంచి రూ. 31 వేలు లంచం తీసుకుంటుండగా పంచాయతీ ఉద్యోగులైన ముగ్గురిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నరేందర్ రెడ్డి ఉన్నారు. పురపాలికలో అభివృద్ధి పనులకు సంబంధించి గుత్తేదారుకు రూ. 2.50 లక్షల బిల్లు ఇవ్వడానికి ఉద్యోగులు లంచం డిమాండ్ చేశారు.

# జంపన్న వాగునుంచి మేడారం భక్తులకు రక్షణ

### కాపాడిన పోలీసులు

ములుగు,ఆగస్ట్8(ఆర్ఎన్ఎ): జంపన్న వాగులో చిక్కుకున్న మేడారం భక్తులను పోలీసులు కాపడారు. వారిని సురక్షితంగా తీసుకుని వచ్చారు. ములుగు జిల్లాలో వానలు జోరుగా కురుస్తున్నాయి. దీంతో వాగులు ఉప్పొంగుతున్నాయి. గోవిందరావుపేట మండలం పస్రా - నార్లాపురం మధ్య జంపన్న వాగు పొంగింది. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. బుధవారం ఉదయం మేడారం వైపు వాహనాల్లో వెళ్లిన 23 మంది భక్తులు వరద నీటిలో చిక్కుకున్నారు. రహదారిపై వరద ప్రవహిస్తుండడంతో భక్తులు తిరిగి రాలేకపోయారు. దీంతో భక్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, స్థానికుల సహాయంతో భక్తులు వరద నీటి నుంచి సురక్షితంగా బయటపడ్డారు. భక్తుల్లో 17 మంది వరంగల్, హన్మకొండ వాసులు కాగా, మిగతా వారు ఆర్మూర్ వాసులు. తమనుసకాలంలో ఆదుకున్నదండకు వారు కృతజ్ఞతలుతెలిపారు.

మహారాష్ట్రను వీడని వర్షాలు

మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కుండబోత వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కొల్హాపూర్ జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అంబెవాడి, ఛిఖ్లీ, శిరోల్ గ్రామాల్లో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తోంది. మోకాళ్లలోతుకు పైగా వరద నీరు కూరుకుపోయిన ప్రాంతాల్లోకి దిగి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వరదల నేపథ్యంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు ఫోన్ చేసి..సహాయక చర్యల కోసం ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ కోస్ట్‌గార్డ్స్, ఆర్మీ దళాలను పంపాలని కోరారు. ఈ మేరకు ఎన్డీఆర్ఎఫ్ టీం, నేవీ బృందాలు ప్రత్యేక విమానాల్లో సహాయక సామాగ్రితో వరద ప్రభావిత ప్రాంతాల్లో ల్యాండయ్యాయి. వరదల నేపథ్యంలో సీఎం ఫడ్నవిస్ నేడు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి కొల్హాపూర్, సంగ్లి జిల్లాల్లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, కొనసాగుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు.

భారీ వర్షాలకు కొల్హాపూర్ జిల్లాలో పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటించారు.

# కాశ్మీర్‌పై అతిగా వ్యవహరిస్తున్న పాక్

### ఏడుగురితో కమిటీ వేసుకున్న ఇమ్రాన్

ఇస్లామాబాద్,ఆగస్ట్8 (ఆర్ఎన్ఎ): కశ్మీర్ అంశంపై అంతర్గత సమాలోచనలు జరిపేందుకు పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై చట్టపరంగా, రాజకీయంగా, ద్వైపాక్షికంగా ఎలా స్పందించాలన్నదానిపై ఈ కమిటీ సూచనలు చేస్తుంది. ఈ మేరకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైనట్టు పాకిస్తాన్ స్థానిక మీడియా వెల్లడించింది. పాకిస్తాన్ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషీ, పాకిస్తాన్ అటార్నీ జనరల్ అన్వర్ మన్సూర్ ఖాన్, విదేశాంగ కార్యదర్శి సోహైల్ మహ్మద్, ప్రధానమంత్రి ప్రత్యేక రాయబారి అహ్మద్ బిలాల్ సూఫీలతో పాటు ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్, మిలటరీ వ్యవహారాలు, అంతర్గత ప్రజా సంబంధాల విభాగాధిపతులు ఈ కమిటీలో ఉంటారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాగా జమ్మూ కశ్మీర్‌ను అసెంబ్లీ ఉన్న కేంద్ర పాలిత ప్రాంతంగానూ, లడఖ్‌ను అసెంబ్లీ లేని కేంద్ర పాలిత ప్రాంతంగానూ మార్చుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్ కశ్మీర్‌పై కమిటీని వేయడం గమనార్హం.

# కాళేశ్వరంపై కాంగ్రెస్ అనవసర విమర్శలు

### ప్రాజెక్ట్ ను పరిశీలిస్తే నిజాలు తెలుస్తాయి: ఎమ్మెల్సీ

కరీంనగర్,ఆగస్ట్8(నేటినిజం ప్రతినిధి): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతానికి వరంలాంటిదని, అయితే ఈ ప్రాజెక్టుపై విపక్షాలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు మండిపడ్డారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించి అనేక రిజర్వాయర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి పదహారు జిల్లాల్లో 42 లక్షల ఎకరాలకు నీటిని అందించే సంకల్పంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. ఈ మేరకు పనులన్ని వేగవంతంగా పూర్తి కావస్తున్నాయని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మవద్దని తెలిపారు. తెలంగాణ ప్రాంతమంతా సస్యశ్యామలం చేసేందుకోసం గోదావరి నీరు సముద్రంలోకి వృథాగా పోకుండా, ఒడిసి పట్టుకొని రాష్ట్రంలోని కోటి ఎకరాలకు అందించే ప్రయత్నం చేస్తుంటే అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ విమర్శించారు. మేడారంలో జరుగుతున్న పనులు చూస్తే నీళ్లు వస్తయో! పోతయో అనేవిషయం తెలుస్తుందనీ అన్నారు. కాళేశ్వరంలో జరుగుతున్న పనులను చూస్తే విషయం అర్థమవుతుందని హితవు పలికారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్, రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.5వేలు అందజేయగా, రైతు మరణిస్తే అతని కుటుం బం రోడ్డున పడకుండా రూ. 5 లక్షల బీమా కల్పిస్తున్న ఘనత సిఎం కెసిఆర్‌దని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ రికార్డులను ప్రక్షాళన చేయించిందని తెలిపారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్‌ను అందించి ఆసరగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన నగదు, కేసీఆర్ కిట్టు పంపిణీతో జిల్లాలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య ఎనభై శాతం పెరిగిందని తెలిపారు. పేదింటి ఆడపిల్లకు కళ్యాణలక్ష్మి ద్వారా సాయం అందజేసి కుటుంబానికి అండగా నిలుస్తుందని తెలిపారు.

### 'ఆర్టికల్ 370'పై..

# అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ

### - తగిన సమయంలో విచారిస్తామన్న ధర్మాసనం

న్యూఢిల్లీ, ఆగస్టు8(ఆర్ఎన్ఎ) : 'జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చట్ట' వ్యతిరేకం అంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అత్యవసర విచారణ జరపాలంటూ ప్రముఖ న్యాయవాది ఎంఎల్ శర్మ బుధవారం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే అత్యవసర విచారణకు జస్టిస్ ఎన్‌వీ రమణ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం తగిన సమయంలో విచారిస్తుందని జస్టిస్ రమణ స్పష్టం చేశారు. మరోవైపు ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం విధించిన నిషేధాజ్ఞలు, మాజీ సీఎంల నిర్బంధాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ కార్యకర్త తహసీన్ పూనావాలా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రభుత్వం ఆంక్షలు ప్రజల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని తహసీన్ ఆరోపించారు. జమ్ముకశ్మీర్‌లో ఆంక్షలు ఉపసంహరించాలని, మొబైల్ ఇంటర్నెట్, మీడియా ఛానళ్ల ప్రసారం, ఫోన్ లైన్లను వెంటనే పునరుద్ధరించాలని తన పిటిషన్‌లో కోరారు. అంతేగాక.. నిర్బంధంలో ఉన్న మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, ఇతర రాజకీయ నాయకులను వెంటనే విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలని కోరగా.. ధర్మాసనం తిరస్కరించింది. కశ్మీర్ విభజన, ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో ఆదివారం నుంచే కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌లో నిషేధాజ్ఞలను అమల్లోకి తీసుకొచ్చింది. ఈ తీర్మానాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడానికి ముందే మెహబూబా ముఫ్తీ, ఒమర్ అబ్దుల్లా సహా కొందరు రాజకీయ నాయకులను గృహనిర్బంధం చేశారు. గత సోమవారం నుంచి వీరు నిర్బంధంలోనే ఉన్నారు. అయితే వచ్చే వారం బక్రీద్ పండగ నేపథ్యంలో ఈ నిషేధాజ్ఞలను కాస్త సడలించాలనే యోచనలో ఉన్నట్లు బుధవారం కొన్ని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

# క్రీడలు

## నేటి భారత్, విండీస్ వన్డే మ్యాచ్‌కు పొంచి ఉన్న వర్షం ముప్పు..?



గయానా: భారత్, వెస్టిండీస్‌ల మధ్య గయానాలో ఇవాళ జరగనున్న మొదటి వన్డే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉందని స్థానిక వాతావరణ శాఖ చెబుతోంది.

అయితే మ్యాచ్ ఆరంభంలోనే కొద్ది సేపు వర్షం కురవవచ్చని, ఆ తరువాత వాతావరణం బాగానే ఉంటుందని అధికారులు తెలిపారు.

అయితే మ్యాచ్ ప్రారంభానికి ముందు వర్షం పడితే మ్యాచ్ ఆలస్యంగా మొదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా ఇప్పటికే భారత్ వెస్టిండీస్ టూర్‌లో భాగంగా 3 టీ20లలో గెలిచి 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుని వన్డే సిరీస్‌పై కన్నేసింది.

## విశ్వటోర్నీ వీడియోలకు 350 కోట్ల వీక్షణలు

దుబాయ్ : వన్డే ప్రపంచకప్ అంటే క్రికెట్ అభిమానుల్లో ఎంత క్రేజ్ ఉంటుందో తెలిసిందే. క్రికెట్ ఆడే దేశాలతో పాటు మిగిలిన దేశాల ప్రజలు విశ్వటోర్నీని ఆసక్తిగా చూస్తారు.

ఇంటర్నెట్ వినియోగం భారత్ సహా చాలా దేశాల్లో గణనీయంగా పెరిగిన నేపథ్యంలో యూట్యూబ్, ఫేస్‌బుక్, హాట్‌స్టార్, ట్విట్టర్ సహా మరిన్ని మాధ్యమాల ద్వారా ఇంగ్లండ్ వేదికగా ఈ ఏడాది జరిగిన ప్రపంచకప్ వీడియోలను క్రికెట్ ప్రేమికులు అధికంగా చూసేశారు. దీంతో ప్రపంచంలో ఎక్కువ మంది చూసిన విశ్వ క్రీడా ఈవెంట్లలో ఒకటిగా వరల్డ్‌కప్ టోర్నీ నిలిచింది. అధికారిక యూట్యూ బ్, ఫేస్‌బుక్ ఖాతాల్లో అప్‌లోడ్ చేసిన ప్రపంచకప్ వీడియోలకు 350 కోట్లకు పైగా వీక్షణలు వచ్చాయని ఐసీసీ బుధవారం ప్రకటించింది.

యూట్యూబ్ చానెల్‌ల్లో 230 కోట్ల వీక్షణలు ఉండగా, ఫేస్‌బుక్‌లో ఆ సంఖ్య 120 కోట్లుగా ఉంది. ఇక హాట్‌స్టార్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లోనూ ఐసీసీ వీడియోలను అధికంగా వీక్షించారు. ఐసీసీ మొత్తం ప్రపంచకప్‌నకు సంబంధించిన 22 వేల డిజిటల్ కంటెంట్‌ను యూట్యూబ్ సహా మిగిలిన మాధ్యమాల్లో పోస్ట్ చేయగా.. 450 కోట్లకు పైగా వీక్షణలు వచ్చాయి. స్మిత్‌ను గేలి చేస్తున్న భారత అభిమానులను టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ సముదాయించిన వీడియోను ఐసీసీ పోస్ట్ చేయగా... ట్విట్టర్‌లో ఎక్కువ మంది చూసిన వీడియోగా రికార్డు సృష్టించింది. అలాగే ఓ మ్యాచ్‌కు ఎక్కువ ట్వీట్లు వచ్చిన రికార్డు భారత్-పాక్ సమరానికే దక్కింది. ఆ తర్వాతి స్థానంలో ఫైనల్ నిలిచింది. ప్రపంచకప్ వల్ల అన్ని మాధ్యమాల్లో ఐసీసీకి కొత్తగా దాదాపు కోటిన్నర మంది ఫాలోవర్లు వచ్చి చేరారు.

## దేశ క్రికెట్‌ను దేవుడే కాపాడాలి

న్యూఢిల్లీ: పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం చిలికి చిలికి గాలివానలా మారుతున్నది. భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్‌కు బీసీసీఐ ఎథిక్స్ అధికారి జస్టిస్ డీకే జైన్ నోటీసులు జారీ చేయడంపై మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశ క్రికెట్‌ను ఇక దేవుడే కాపాడాలంటూ దాదా బుధవారం తనదైన రీతిలో ట్వీట్ చేశాడు. 'భారత క్రికెట్‌లో సరికొత్త ఫ్యాషన్. పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశం నిరంతరం వార్తల్లో నిలుస్తున్నది. దేశ క్రికెట్‌ను ఇక దేవుడే కాపాడాలి' అని గంగూలీ ట్వీట్ వదిలాడు. సీనియర్ క్రికెటర్ హర్భజన్‌సింగ్..గంగూలీకి మద్దతుగా నిలుస్తూ ట్విట్టర్‌లో స్పందించాడు. 'అసలు ఇది ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు కానీ వార్తల్లో నానుతూనే ఉన్నది.

భారత క్రికెట్‌లో ద్రవిడ్‌ను మించిన మంచి వ్యక్తి మరొకరు దొరకరు. దిగ్గజాలను అవమానించేందుకు ఇలా నోటీసులు పంపిస్తున్నారు. క్రికెట్‌కు ద్రవిడ్ లాంటి వారి సేవలు ఎంతో అవసరం. దాదా అన్నట్లు క్రికెట్‌ను దేవుడే కాపాడాలి' అని భజ్జీ ట్వీట్ చేశాడు. ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) డైరెక్టర్‌గా కొనసాగుతున్న ద్రవిడ్..చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి చెందిన ఇండియా సిమెంట్స్ కంపెనీకి ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నాడు. జోడు పదవుల్లో కొనసాగుతూ ద్రవిడ్ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడుతున్నాడంటూ మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు సంజయ్ గుప్తా ఫిర్యాదు చేశాడు. దీంతో బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ డీకే జైన్..రెండు వారాల్లోగా స్పందించాలంటూ ద్రవిడ్‌కు నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

### మున్సిపల్ ఎన్నికల్లో..

## బీసీలు, ముస్లింలకు 50శాతం టికెట్లు

**- మున్సిపాలిటీల్లో పార్టీకి విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయి**

**- రిజర్వేషన్ల పై ప్రభుత్వ వైఖరిని ప్రజల్లో ఎండగట్టండి**

**- టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు8(ఆంఎన్‌ఎ) : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు, ముస్లింలకు 50శాతం టికెట్లు ఇవ్వాలని పార్టీ నిర్ణయం తీసుకుందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి. అన్నారు.

గురువారం గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ ఉత్తమ్ అధ్యక్షతన మున్సిపల్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి భట్టి, బోసురాజు, సలీమ్ అహ్మద్, పొన్నం, కుసుమ కుమార్, వంశీ చంద్‌రెడ్డి, వివిధ జిల్లాల పార్టీ అధ్యక్షుడు, ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేఖ విధానాలనుఅవలంభిస్తుందని అన్నారు. ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినా కేసీఆర్ అవేవీ పట్టడం లేదన్నారు. రైతులకు బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని, ప్రభుత్వం మాఫీ చేస్తామన్న రుణమాఫీపై ఇప్పటికే ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేఖత ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ మున్సిపాల్టీల్లో ఉద్యమాలు చేయాలని ఉత్తమ్ పిలుపునిచ్చారు. బీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ తరపున బీసీలకు, ముస్లింలకు 50శాతం టికెట్స్ ఇవ్వాలని నిర్ణయించామని వెల్లడించారు. ఇంటింటికి కాంగ్రెస్, వాడవాడలా జెండా కార్యక్రమం విజయవంతమైందని, చేయని ప్రాంతాల్లో వెంటనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మున్సిపాల్టీల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని.. మున్సిపాలిటీల్లో పార్టీకి విజయావకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలన్నారు. పార్టీ అభివృద్ధికి కష్టపడేవారికి తగిన ప్రాధాన్యత ఇస్తుందని, పట్టణాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. తెలంగాణ తెరాసకు ప్రత్యామ్నయం కాంగ్రెస్‌పార్టీయేనని, వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం తెచ్చుకొని అధికారంలోకి వస్తుందని అన్నారు. ఆమేరకు ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలపై పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాలని, ప్రజల్లో ప్రభుత్వం తీరును ఎండగట్టాలని ఉత్తమ్ పిలుపునిచ్చారు.

## ఆలయాల్లో శ్రావణ సందడి

**నేడు పలు ఆలయాల్లో వరలక్ష్మీవ్రతాలు**





హైదరాబాద్,ఆగస్ట్8 (ఆంఎన్‌ఎ): ఆలయాలు శ్రావణశోభతో అలరారుతున్నాయి. గురువారం కావడంతో పాటు, శుక్రవరాం వరలక్ష్మి వ్రతంకావడంతో ప్రముఖ ఆలయాల్లో వ్రతాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ కనక దుర్గ, శ్రీశైలం, మహానంది, అన్నవరం, సింహాచలం, యాదాద్రి, వేములవాడ,కాళేశ్వరంలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర క్షేత్రంలో శ్రావణమాస శోభ సంతరించుకుంది. గత సోమ వారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం అయ్యాయి. శివుడికి ఇష్టమైన మాసం కావడంతో భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యసన్నాలు ఆచరించి అభిషేకా లకు బారులు తీరారు. ఇలీవలి వర్షాలకు గోదావరిలో వరదనీరు చేరడంతో పర్యాటకులు వచ్చి ఉదయాన్నే స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యం లో శుభప్రదమయిన శ్రావణం ప్రారంభం కావడంతో సుదూర ప్రాంత భక్తులు త్రివేణి సంగమ తీరంలో స్నానాలతో పులకిం చిపోయారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుభ శ్రావణ మాసం ప్రారంభం అవుతుండగా నెల రోజుల పాటు భక్తులు శ్రావణ మాస ప్రత్యేక పూజల్లో పాల్గొంటారని ఆలయ అధికారులు తెలిపారు. ఈ మాసంలో అనేక మంది భక్తులు క్షేత్రం చేరుకొని త్రివేణి సంగమ తీరంలో పుణ్యస్నానాలు, దంపతి స్నానం, ఇసుకతో సైకిత లింగాన్ని తయారు చేయడం, కాళేశ్వర ముక్తీశ్వరస్వామి, ఆది ముక్తీశ్వర శుభానంద దేవి దర్శనం, పార్వతీ ఆలయంలో మంగళగౌరి వ్రతా లు, సరస్వతి అమ్మవారి సన్నిధిన అక్షర స్వీకారాలు, రాహుకేత కాలసర్పదోష పూజలు, ఏకాదశ లఘు రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు, అష్టోత్తర శతనామావళి, శ్రావణ హోమాలు తదితర పూజలతో అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. భక్తులు శ్రావణమాసంలో ప్రత్యేకంగా ఉపవాస దీక్షలతో, నిత్యం ఇక్కడికి వస్తుం టారు. నూతనంగా వివాహం అయిన వధువులు అమ్మ వారి ఆలయ ంలో మంగళ గౌరీ వ్రతాలు నిర్వహించడం జరుగుతంది. శ్రావణ మాసంలోని నాలుగు మంగళవారాల్లో శుభానంద దేవికి కుంకుమార్చనలు నిర్వహి స్తారు. శివునికి అత్యంత ప్రీతికరమైన లక్ష బిల్వార్చన పూజలను భక్తులు శ్రావణ మాసంలో నిర్వహిస్తుంటారు. ఈ మాసంలో అటవీ ప్రాంతంలో విరివిగా మారేడు బిల్వ పత్రి లభించడం అందుకు విశేషం.

### ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు..

## కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయి

**- ప్రభుత్వ నిర్ణయాలపై టీడీపీ అనవసర రాద్ధాంతం చేస్తుంది**

**- తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు**

**- సెప్టెంబర్1 నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం**

**- తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఏపీ మంత్రి కొడాలి నాని**

తిరుపతి, ఆగస్టు8(ఆంఎన్‌ఎ) : వైసీపీ ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని, వాటిని జగన్ ఆధ్వర్యంలో సమర్థవంతంగా తిప్పికొడతామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని అన్నారు. గురువారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కోసం తన మొక్కు చెల్లించుకున్నానని అన్నారు. జగన్‌ను ముఖ్యమంత్రిగా చూడాలన్న తన కల నెరవేరిందని.. అందుకే ఇప్పుడు మొక్కు చెల్లించుకున్నానని నాని చెప్పారు. జగన్‌కు, ఏపీ ప్రజలకు వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నాను అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షం టీడీపీ అనవసరం రాద్ధాంతం చేస్తోందన్నారు. సర్కార్‌కు నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వీకరిస్తామని.. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదన్నారు. గ్రామ వాలంటీర్ల విషయంలో ప్రతిపక్ష నేత చంద్రబాబు చేస్తున్న విమర్శల్లో నిజం లేదని నాని స్పష్టంచేశారు. చంద్రబాబు పనీపాటా లేకుండా ఇష్టం వచ్చినట్లు ఏదేదో మాట్లాడుతున్నారంటూ మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక నదులన్నీ పూర్తిస్థాయిలో నిండాయన్నారు. జగన్‌ను ఇబ్బంది పెట్టడానికి, ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి కుట్రలు జరుగుతున్నాయని మంత్రి అన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నా రన్నారు. సెప్టెంబర్1 నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తామని నాని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నాణ్యమైన రేషన్ సరుకులను ప్రజలకు అందిస్తామని, ఈ ప్రాజెక్టును శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభిస్తామనీ తెలిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.11,000 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. బ్యాగుల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. రేషన్ సరుకులను నేరుగా ప్రజలకు చేరవేసేందుకు బ్యాగులు వాడుతున్నామన్నారు. ప్రతిపక్షం ఏవీ తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు, స్వయం ప్రకటిత మేధావులు, ఇతర ముసుగుల్లో కొందరు జగన్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి నాని ఆరోపించారు.

## 370 రద్దును స్వాగతించిన కరణ్ సింగ్

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆర్‌ఎన్‌ఎ): కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును కాంగ్రెస్ నేత కరణ్ సింగ్ స్వాగతించారు. ఇఇ మంచి నిర్ణయమని అంగీకరించారు. ఈ అంశంపై మహారాజా హరిసింగ్ కుమారుడు అయిన డాక్టర్ కరణ్ సింగ్ స్పందించారు. లడాక్ ప్రాంతాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించడాన్ని ఆయన స్వాగతించారు. ఆర్టికల్ 35ఏలో ఉన్న లింగ వివక్షపైన ప్రభుత్వం చర్య తీసుకోవాలన్నారు. జమ్మూకశ్మీర్‌లోని అన్ని వర్గాల ప్రజల క్షేమం కోరుతున్నట్లు ఆయన ఓ లేఖ విడుదల చేశారు. ఇప్పటికే అనేకమంది కాంగ్రెస్ నేతలు రద్దు నిర్ణయాన్ని స్వాగతించారు.

### తెలంగాణ వచ్చాక..

## ఒక్క పరిశ్రమ కూడారాలేదు

**- ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారు**

**- తెరాసకు ప్రత్యామ్నాయం బీజేపీనే**

**- మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత దత్తాత్రేయ**

సిద్దిపేట, ఆగస్టు 8(ఆర్‌ఎన్‌ఎ) : తెలంగాణ వచ్చాక ఒక్క పరిశ్రమ కూడా రాలేదని కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ విమర్శించారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 28వ వార్డులో సంస్థాగత బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దత్తాత్రేయ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 13వరకు కొనసాగుతుందని దత్తాత్రేయ పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, యువకులు బీజేపీలో చేరుతున్నారన్నారు. కేంద్రంలో ఐదేళ్ల పాలన అద్భుతంగా సాగిందని, తద్వారా ప్రజలంతా ఏకమై లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 303 స్థానాలు బీజేపీకి అప్పగించారని అన్నారు. తెలంగాణలోనూ నాలుగు ఎంపీ స్థానాలను గెలుచుకొని బీజేపీ తన సత్తాను చాటిందన్నారు. తద్వారా రాబోయే కాలంలో బీజేపీ తెలంగాణలో అధికార పార్టీగా రూపాంతరం చెందుతుందని దత్తాత్రేయ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కేసీఆర్ అరాచక పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకో మాట, రోజుకో హామీతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రాజెక్టులను రీడిజైన్ పేరుతో కోట్లరూపాయలు దోచుకొని, ప్రాజెక్టులన్నీ కట్టేస్తున్నామంటూ కేసీఆర్ గొప్పలు పోతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ఒక్క పరిశ్రమ కూడా రాలేదని దత్తాత్రేయ విమర్శించారు. త్వరలో బీజేపీలో భారీ చేరికలు ఉంటాయని అన్నారు. బీజేపీలో చేరిన వారు దేశంకోసం పనిచేయాలని దత్తాత్రేయ హితవు పలికారు

## ఒడిశాలో వర్షాలతో వంశధార,నాగావళిలకు వరదపోటు

**గొట్టబ్యారేజీ గేట్లు ఎత్తివేత.. దిగువకు నీటి విడుదల**

**క్షేత్రస్థాయిలో అధికారుల అప్రమత్తం**

**కలెక్టర్‌తో మాట్లాడిన మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్**

శ్రీకాకుళం,ఆగస్ట్8 (ఆంఎన్‌ఎ): ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు వంశధార, నాగావళి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. హిరమండలం గొట్టాబ్యారేజీకి వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో కింది ప్రాంతాల ప్రజలను అప్రమత్తంచేశారు. మరోవైపు కలెక్టర్ ఎప్పటికప్పుడు పరిస్తితిని సమీక్షంచి అధికారకలు హెచ్చరికలు చేశారు. క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ నివాస్‌తో మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఫోన్లో మాట్లాడారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.నదులు, వాగులు దాటే ప్రయత్నం చేయకుండా హెచ్చరికలు జారీ చేయాలని కోరారు. వరద ప్రభావం ఉండే అన్ని గ్రామాలను అప్రమత్తం చేయాలని మంత్రి ఆదేశించారు. బ్యారేజీకి 1,12,210 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం అంతకంతకూ పెరిగిపోవడంతో బ్యారేజీ వద్ద అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అక్కరాపల్లి, రెల్లివలస, గులుమూరు తదితర గ్రామాల వద్ద పంట పొలాలు నీట మునిగాయి. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను అప్రమత్తం చేశారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉండాలని సూచించారు. గొట్టాబ్యారేజీ వద్ద ఇంజనీర్లు వరద తీవ్రతను అంచనావేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తున్నారు. మరోవైపు నాగావళికి కూడా వరదనీటి ప్రవాహం పెరుగుతోంది.తోటపల్లి జలాశయానికి 42,579 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా..50,611 క్యూసెక్కుల నీటిని కిందికి వదులు తున్నారు. నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి జోరుగా ప్రవహిస్తోంది.దీంతో నదీ పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల వీఆర్వోలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ నివాస్ ఆదేశాలు జారీ చేశారు. అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురైనప్పుడు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08942240557కు ఫోన్ చేసి చెప్పవచ్చని కలెక్టర్ సూచించారు.

## కశ్మీర్‌లో శాంతి కోరుకుంటున్నా

**నోబెల్ గ్రహీత మలాలా ట్వీట్**

న్యూఢిల్లీ,ఆగస్ట్8(ఆర్‌ఎన్‌ఎ): కశ్మీర్‌లో తాను శాంత ఇకోరుకుంటున్నానని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, బాలల హక్కుల నేత మలాలా యూసఫ్‌జాయ్ అన్నారు.

అక్కడ ప్రజలు నిర్భయంగా బతకాలన్నదే తన ఆశ అని కాశ్మీర్ అంశంపై స్పందించారు. ట్విట్టర్ వేదికగా తన మనోగతాన్ని వెల్లడించారు.

శాంతియుత మార్గంలోనే కశ్మీర్ వివాదానికి పరిష్కారం దొరుకుతుందని ట్వీట్‌లో పేర్కొన్నారు.

శాంతియుతంగా జీవించగలమని.. ఒకరిని మరొకరు బాధించుకోవలసిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ వివాదంలో ఎంతో మంది కశ్మీరీ స్త్రీలు, చిన్నారులు సమిధలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కశ్మీర్ వివాదంపై దక్షిణాసియా దేశాలు, అంతర్జాతీయ సమాజం స్పందించాలని కోరారు.

ఏడు దశాబ్దాలుగా అమలు కాని ఒప్పందాలపై దృష్టిపెట్టాలని సూచించారు.

కశ్మీరీ ప్రజలు నా చిన్నతనం నుంచి.. ఇంకా చెప్పాలంటే నా తల్లిదండ్రుల చిన్నతనం నుంచి సంఘర్షణలో ఉన్నారు. ఏడు దశాబ్దాలుగా హింసను అనుభవిస్తున్నారు. కశ్మీరీల బాగోగుల గురించి నేను ఆలోచిస్తాను. ఎందుకంటే దక్షిణాసియా నా ఇల్లు. 180 కోట్ల మంది ప్రజల్లో కశ్మీరీలు కూడా ఓ భాగం. మనం విభిన్న మతాలకు, సంస్కృతులకు, సంప్రదాయాలకు చెందిన వారిమైనప్పటికీ .. అందరూ శాంతియుతంగా ఉండాలన్నదే నా అభిప్రాయం అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# ఆకట్టుకుంటున్న 'రాహు' ఫస్ట్ లుక్




కృతి గార్గ్, అభిరామ్ వర్మ, కాలకేయ ప్రభాకర్ కీలక పాత్రల్లో తెరకెక్కిన సినిమా రాహు. ప్రస్తుతం నిర్మాణ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు చిత్రయూనిట్. ఈ సందర్భంగా దర్శకుడు సుబ్బు మాట్లాడుతూ.. 'కొత్త సబ్జెక్ట్స్‌తో కొత్త డైరెక్టర్స్ తెలుగు సినిమాని రివల్యూషనైజ్ చేస్తున్నారు. ఇది కూడా అలాటి ఒక న్యూ ఏజ్ సినిమా అవుతుంది' అన్నారు. న్యూయార్క్ యూనివర్సిటీ ఫిలిం స్కూల్‌లో పట్టా పొందిన సుబ్బు.. రాహు సినిమాను టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో రూపొందించారు. ఈ సినిమా కాన్సెప్ట్, నటీ నటుల పెర్ఫార్మన్స్ ప్రేక్షకుల్ని తప్పకుండా ఆకట్టుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు చిత్ర నిర్మాతలు. ఏవీఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు లక్కరాజు సంగీతమందిస్తున్నారు. చలాకీ చంటి, గిరిధర్, సత్యం రాజేష్, స్వప్నిక ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

# విజయ్‌కు జంటగా కియారా ?



కోలీవుడ్ ఆఫర్ల కోసం బాలీవుడ్ బ్యూటీస్ సహా పలు భాషలకు చెందిన వారు ఆసక్తి చూపుతారన్నది వాస్తవం. ఇప్పటికే పలువురు బాలీవుడ్ భామలు కోలీవుడ్‌లో ఒక వెలుగు వెలిగారు. తాజాగా నటి కియారాను కోలీవుడ్‌కు దిగుమతి చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. ఈ అమ్మడు ఇప్పటికే టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి భరత్ అనే నేను చిత్రంతో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకుంది. కాగా తాజాగా తమిళంలో విజయ్ సరసన నటింపజేసేందుకు చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. విజయ్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో బిగిల్ చిత్రంలో నటిస్తున్నారు. ఏజీఎస్ సంస్థ నిర్మిస్తున్న ఇందులో నటి నయనతార నాయకిగా నటిస్తోంది. చిత్రాన్ని దీపావళికి విడుదల చేయనున్నట్లు చిత్ర వర్గాలు ఇప్పటికే ప్రకటించారు. విజయ్ హీరోగా తెరకెక్కించనున్న చిత్ర ప్రీ ప్రొడక్షన్స్ కార్యక్రమాలను పూర్తి చేస్తున్నారు. పీవీ.ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించనున్న ఈ చిత్రాన్ని అక్టోబర్‌లో ప్రారంభించి వచ్చే ఏడాది జనవరి కల్లా పూర్తి చేయడానికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. కాగా ఇందులో విజయ్‌తో రొమాన్స్ చేసే నాయకి ఎవరన్న విషయం గురించి పలు రకాల వార్తలు ప్రచారంలో ఉన్నాయి. నటి త్రిష, క్రేజీ నటి రష్మిక పేర్లు కూడా ప్రచారంలో నానుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో కొత్తగా బాలీవుడ్ బ్యూటీ కియారా పేరు వెలుగులోకి వచ్చింది. ఆమె కాల్‌షీట్స్ సెట్ అయితే, మరే చిత్రంలోనూ నటించకపోతే విజయ్‌తో రొమాన్స్ చేయడానికి కమిట్ అయ్యే అవకాశం ఉన్నట్లు తాజా సమాచారం.

# హన్సిక, రమ్యకృష్ణ కాంబినేషన్‌లో..



కోలీవుడ్‌లో నాటి నేటి నాయికలతో చిత్రాలు చేసే ట్రెండ్ నడుస్తోందా అని అనుకునేలా క్రేజీ కాంబినేషన్లలో చిత్రాలు తెరకెక్కుతున్నాయి. ఇటీవల జాక్‌పాట్ చిత్రంలో నటి జ్యోతిక, రేవతి ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రస్తుతం నటి త్రిష, సిమ్రాన్ కలిసి ఒక చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా నటి హన్సిక, రమ్యకృష్ణ కలిసి నటించడానికి రెడీ అవుతున్నారని తెలిసింది. ప్రభుదేవా, హన్సిక జంటగా నటించిన గులేభాకావళి వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని తెరకెక్కించిన కల్యాణ్ ఇటీవల నటి జ్యోతిక, రేవతి ప్రధాన పాత్రల్లో నటించిన జాక్‌పాట్ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం గత శుక్రవారమే తెరపైకి వచ్చింది. ఈ రెండూ వినోదమే ప్రధానంగా రూపొందిన చిత్రాలన్నవి గమనార్హం. కాగా కల్యాణ్ చిత్రానికి సిద్ధమైపోయారు. ఈయన తాజా చిత్రానికి కామెడీనే ప్రధాన అంశంగా తీసుకున్నట్లు సమాచారం. నటి హన్సిక కథానాయకిగా నటించనున్న ఇందులో రమ్యకృష్ణ ప్రధాన పాత్రలో నటించనున్నట్లు సమాచారం.

దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. కాగా హన్సిక, రమ్యకృష్ణ కలిసి 2015లో ఆంబళ అనే చిత్రంలో నటించారు. అందులో విశాల్ హీరో. కాగా ప్రస్తుతం నటి హన్సిక నటిస్తున్న తన 50వ చిత్రం నిర్మాణంలో ఉందన్నది గమనార్హం. ఇది ఆరంభం నుంచే చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ మధ్య ఆ చిత్రం ఊసే ఎవరూ ఎత్తడం లేదు. కారణాలేమిటో తెలియదు గానీ, ఆ తరువాత నటి హన్సికకు మరో అవకాశం రాలేదు. అలాంటిది ఈ ముద్దుగుమ్మకు దర్శకుడు కల్యాణ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. ఇంతకుముందు తాను దర్శకత్వం వహించిన గులేభాకావళి చిత్ర నాయకి హన్సికనే అన్నది గమనార్హం. ఆ చిత్రం మంచి హిట్ అయ్యింది. ఆ సెంటిమెంట్‌తోనే దర్శకుడు కల్యాణ్ తన తాజా చిత్రానికి ఆమెను ఎంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.






రైల్వే చైల్డ్‌లైన్ హెల్ప్ డెస్క్‌ను వరంగల్‌లో ప్రారంభించిన కలెక్టర్ ప్రశాంత్ పాటిల్. చిత్రంలో పోలీస్ కమిషనర్ రవీందర్ కూడా ఉన్నారు.

## ఖమ్మం, కరీంనగర్‌లలో..

# మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయండి

**- నూతన జిల్లాల్లో ఆస్పత్రులను అప్‌గ్రేడ్‌కు సహకరించండి**

**- రాష్ట్ర పరిధిలోని ఆరోగ్య పథకాలకు నిధులివ్వండి**

**- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్‌తో ఈటెల భేటీ**

**- ఎన్ఎంసీ బిల్లు అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఈటెల**

**- అర్హత పొందే వరకు ఎన్నేళ్లయినా పరీక్ష రాయొచ్చని కేంద్ర మంత్రి చెప్పారు**

**- బిల్లు అర్థమైతే విద్యార్థులు సంతోషపడతారన్న ఈటెల**

న్యూఢిల్లీ, ఆగస్టు8(ఆర్ఎన్ఎ) : ఖమ్మం, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలకు సహకారం అందించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్‌రెడ్డికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేంద్ర విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో ఈటల కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. ఈసందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ఆరోగ్య పథకాలకు సహకరించాలని కోరారు. భేటీ అనంతరం ఈటెల విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలపై కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ఆరోగ్య పథకాలకు సాయమందించాలని కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. హైదరాబాద్‌లో గాంధీ ఆసుపత్రి, నీలోఫర్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాకులు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరామన్నారు. ఖమ్మం, కరీంనగర్ జిల్లా కేంద్రాల్లో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేయాలని చెప్పామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఆస్పత్రులను అప్ గ్రేడ్ చేయాల్సి ఉందని, అందుకు సహకరించాలని కోరినట్లు ఈటల తెలిపారు. తెలంగాణలో తొమ్మిది జిల్లాలలో ఆసుపత్రుల ఆధునికీకరణకు సహకరిస్తామని కేంద్రమంత్రి చెప్పారు. రాష్ట్రంలో అదనపు డయాలసిస్ సెంటర్ల ఏర్పాటు, జాతీయ రహదారుల పక్కన ట్రామా సెంటర్లను ఏర్పాటు, ఆరోగ్య శ్రీ, కేసీఆర్ కిట్ పథకాలకు సహకారం అందించాలని కోరానన్నారు. హైదరాబాద్‌లో బస్తీ దవాఖానాలు ప్రారంభించామని, గ్రామాల్లో ఉన్న వైద్య శిబిరాలను వెల్ నెస్ సెంటర్లుగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని, ఎయిమ్స్ నిర్మాణం, సైన్స్ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు ఈటల చెప్పారు. మంత్రి దృష్టికి ఎన్ఎంసీ బిల్లు అంశాన్ని కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఈటల వివరించారు. ఈ బిల్లు ద్వారా మేలే జరుగుతుందని, పీజీ వైద్య విద్యార్థులు అర్హత పొందే వరకు ఎన్నేళ్లయినా పరీక్ష రాయొచ్చని కేంద్రమంత్రి చెప్పారని ఈటల తెలిపారు. బిల్లు అర్థమైతే విద్యార్థులు సంతోషపడతారన్నారని ఈటల చెప్పారు. మరోవైపు వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల, ఆదిలాబాద్ రిమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాకులు త్వరలో అందుబాటులోకి రాబోతునాన్నయని ఈటల వివరించారు.

### ఉద్యోగమేళాను వినియోగించుకోవాలి

శ్రీకాకుళం,ఆగస్టు8 (ఆర్ఎన్ఎ): గిరిజన యువత ఉద్యోగమేళాను వినియో గించుకోవాలని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి కోరారు. సీతంపేట వైటీసీలో స్థానిక ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆలీవ్ ఫౌండేషన్ సహకారంతో ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్‌లో మంచిపేరున్న కంపెనీల ఆధ్వర్యంలో ఉద్యోగకల్పన జరుగుతుందని అన్నారు. కంపెనీలో బాగా రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు. మొత్తం 1110 ఉద్యోగాల కల్పనకు ఈ ఉద్యోగమేళా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సాయికాంత్‌వర్మ, వైటీసీ కేర్‌టేకర్‌లు వెంకటరమణ, శ్రీనివాసరావు, మల్లేశ్వర్‌రావు, రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రద్దు చేసిన పాకిస్థాన్

**- ఇప్పటికే వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకున్న పాక్**

**- పాక్ నిర్ణయంతో భారత్‌కు వచ్చే నష్టమేమీ లేదు**

**- జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్**

న్యూఢిల్లీ, ఆగస్టు 8(ఆర్ఎన్ఎ) : కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపతి కల్పించే 370 అధికరణను భారత్ రద్దు చేయడంపై పాకిస్తాన్ గగ్గోలు పెడుతోంది. ఇది తమ దేశ అంతర్గత వ్యవహారమని భారత్ స్పష్టం చేసినప్పటికీ పాక్ మాత్రం కశ్మీర్‌పై భారత్ వైఖరిని తప్పుబడుతోంది. అంతే కాదు.. కోరి కయ్యానికి కాలు దువ్వుతోంది. ఇప్పటికే భారత్‌తో వాణిజ్య సంబంధాలను రద్దు చేసుకున్న పాకిస్తాన్ తాజాగా మరో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. భారత్-పాకిస్తాన్ మధ్య రాకపోకలు సాగించే సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలును పాక్ నిలిపివేసినట్లు ఆ దేశ మీడియాలో వార్తలు రావడం చర్చనీయాంశమైంది. 1976వ సంవత్సరంలో జరిగిన సిమ్లా ఒప్పందం ప్రకారం సంఝౌతా ఎక్స్‌ప్రెస్ భారత్-పాకిస్తాన్ మధ్య రాకపోకలు సాగిస్తోంది. వీక్లీ ఢిల్లీ నుంచి లాహోర్‌కు రాకపోకలు సాగించే ఈ ట్రైన్ సర్వీసును ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ నిలిపివేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే ఇప్పటికే పాకిస్తాన్ భారత్‌తో వాణిజ్య సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయించుకుంది. పాక్ తీసుకున్న ఈ నిర్ణయంపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. పాక్ తన నిర్ణయాన్ని పున: సమీక్షించుకోవాలని భారత్ సూచించింది. ఆర్టికల్ 370 అనేది పూర్తిగా భారత అంతర్గత వ్యవహారమని, భారత్‌తో సన్నిహిత సంబంధాలను తెంచుకోవాలనుకోవడం సరైన నిర్ణయం కాదని విదేశాంగ శాఖ బదులిచ్చింది. పాక్ దుష్ప్రచారం చేయడం ఇకనైనా మానుకోవాలని విదేశాంగ శాఖ హెచ్చరించింది. కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ అనవసరంగా తలదూర్చాలని చూస్తోందని విదేశాంగ శాఖ విమర్శించింది.

పాక్ నిర్ణయంతో భారత్‌కు వచ్చే నష్టమేమీ లేదు - దోభాల్

కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపతి కల్పించే 'ఆర్టికల్ 370'ను భారత్ రద్దు చేసిన నేపథ్యంలో పాకిస్తాన్ కయ్యానికి కాలు దువ్వుతోంది. భారత్‌తో వాణిజ్య సంబంధాలను రద్దు చేసుకోవడం, సంఝౌత ఎక్స్‌ప్రెస్ నిలిపివేత, భారతీయ సినిమాల బహిష్కరణ ఇలా పలు నిర్ణయాలతో పాకిస్తాన్ పరిస్థితిని మరింత జటిలంగా మార్చే స్థితికొచ్చింది. అయితే.. పాకిస్తాన్‌కు ఒక్క చైనా తప్పిస్తే మరే దేశం మద్దతు తెలిపే పరిస్థితి కనిపించడం లేదు. పాకిస్తాన్ వాణిజ్య సంబంధాలను తెగతెంపులు చేసుకోవడం వల్ల భారత్‌కు పెద్ద నష్టమేమీ లేదని ఇప్పటికే ఆర్థిక నిపుణులు స్పష్టం చేశారు. ఇదే విషయంపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ భారత్‌తో వాణిజ్య సంబంధాలను రద్దు చేసుకుంటూ పాక్ తీసుకున్న నిర్ణయంపై తనదైన రీతిలో స్పందించారు. పాక్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాకిస్తాన్ భారత్‌తో వాణిజ్య సంబంధాలను తెగతెంపులు చేసుకుందని, ఈ నిర్ణయంతో భారత ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం జరిగిందని దోభాల్ ట్వీట్ చేశారు. ఎంత నష్టమంటే.. విరాట్ కోహ్లి తన ఇన్‌స్టాగ్రాంలో ఒక వాణిజ్య ప్రకటన పోస్ట్ చేయాలంటే ఎంత వసూలు చేస్తాడో అంత నష్టం జరిగిందని.. ఇది చాలా బాధాకరమని.. ఈ భారీ నష్టాన్ని ఎలా భర్తీ చేసుకోవాలని దోభాల్ వ్యంగ్యాస్త్రం సంధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. 'భారత్‌తో వాణిజ్యం బంద్' అని పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయాన్ని అజిత్ దోభాల్ కూరలో కరివేపాకులా తీసిపడేశారు. ఈ నిర్ణయం వల్ల భారత్‌కు వచ్చిన నష్టమేమీ లేదనేది ఆయన అభిప్రాయంగా భావించవచ్చు.

# మలాలా ట్వీట్‌పై నెటిజన్ల విమర్శలు

**- సొంత దేశంలో నివసించలేకపోయిన నువ్వా హితవు చెప్పేది**

**- తీవ్ర స్థాయిలో మండిపడ్డ ఎన్ఎస్ఏ అజిద్ దోవల్**

న్యూఢిల్లీ,ఆగస్టు8(ఆర్ఎన్ఎ): జమ్ముకశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని భారత ప్రభుత్వం రద్దు చేసిన అనంతరం పాక్ జాతీయురాలు, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మలాలా యూసఫ్ జాయ్ స్పందించిన తీరుపై నెటిజన్లు మండిపడ్డారు. అలాగే భద్రతా సలహాదారు అజజజిత్ధభోల్ కూడా తీవ్రంగా మండిపడ్డారు. కశ్మీర్ లోని మహిళలు, చిన్నారుల పట్ల తాను ఆందోళన చెందుతున్నానని ఆమె ట్వీట్ చేశారు. 'నా చిన్నప్పటి నుంచి, మా తల్లిదండ్రులు చిన్నవారిగా ఉన్నప్పటి నుంచి, మా తాతలు యువకులుగా ఉన్నప్పటి నుంచి దశాబ్దాలుగా కశ్మీర్ ప్రజలు తీవ్ర సంఘర్షణను అనుభవిస్తూనే ఉన్నారన్నారు. దక్షిణాసియాకు చెందిన యువతిని కాబట్టి... నేను కశ్మీర్ గురించి తపనపడతానని అన్నారు. 'కశ్మీర్ విభిన్న మతాలు, సంప్రదాయాలు, భాషలు, వంటకాల సముదాయమని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ హింస, ఘర్షణ చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఆమె ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కశ్మీరీ మహిళలు, చిన్నారుల గురించి ఆందోళన చెందుతున్నానని, దక్షిణాసియా దేశాలు, అంతర్జాతీయ సమాజం అక్కడి ప్రజల బాధ గురించి ఆలోచించాలని ఆమె ట్విటర్‌లో కోరారు. మానవహక్కుల పరిరక్షణకు అందరూ ప్రాధాన్యతను ఇవ్వాలని, ఏడు దశాబ్దాలుగా ఉన్న సమస్యను శాంతియుతంగా పరిష్కరించేందుకు యత్నించాలని మలాలా వ్యాఖ్యానించారు. మరోవైపు మలాలా వ్యాఖ్యలపై భారతీయ నెటిజెన్లు మండిపడుతున్నారు. నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకున్నప్పటికీ... పాకిస్థాన్ కు వత్తాసు పలుకుతూ మలాలా మాట్లాడిందని... ఇది సిగ్గుచేటని విమర్శిస్తున్నారు. మలాలా ట్వీట్‌పై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఘాటుగా స్పందించారు. గురువారం ఆయన ఇచ్చిన ఓ ట్వీట్‌లో పాకిస్థాన్‌లో కాల్పులకు గురై, భద్రతా కారణాలతో పాకిస్థాన్‌ను వదిలిపెట్టి, ప్రస్తుతం బ్రిటన్‌లో స్థిరపడిన బాలిక ట్వీట్ చేస్తోందని ఎద్దేవా చేశారు. ఇది ఎంత సిగ్గుచేటంటే, తన సొంత దేశంలో నివసించలేకపోయిన వ్యక్తి లక్షలాది మంది ప్రజలను అక్కడ నివసించాలని కోరుతున్నారు. ఈ చెత్తని ట్వీట్ చేయడానికి ముందు మీరు పాకిస్థాన్‌లో స్థిరపడాలని మీకు సవాల్ చేస్తున్నానని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com